

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

### ఆచార్య రంగా కి ఉపరాష్ట్రపతి నివాళి

విజయవాడ జూన్ 9 స్వాతంత్ర సమరయోధులు, సీనియర్ పార్లమెంటేరియన్.... భారత రైతాంగ ఉద్యమ నిర్మాతలలో ఒకరైన ఆచార్య ఎన్.జి రంగా వర్ధంతి సందర్భంగా భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు ఘన నివాళు లర్పించారు. దీర్ఘకాలం రైతుల సంక్షేమం.... వారి సమస్యల పరిష్కారం కు శ్రీ రంగా చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. పార్లమెంటు లోపల వెలుపల ఆర్థికపరమైన అంశాలపైన శ్రీ రంగా అనర్గళంగా మాట్లాడేవారని అన్నారు. యువతకు రాజకీయాలు నేర్పేందుకు పాఠశాలను నెలకొల్పడం అటుంచి.... ఆ పాఠశాలను మహాత్మా గాంధీచే ప్రారంభింప చేయటం గొప్ప విషయమంటూ శ్లాఘించారు. ఇంతటి మహనీయుడు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ నేటి యువత ముందడుగు వేయాలని శ్రీ నాయుడు పిలుపునిచ్చారు.

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 10 జూన్ 2021 సంపుటి : 02 సంచిక :323 పేజీలు : 4 వెల : రూ 3-00

# రైతన్నలకు శుభవార్త...

## కేంద్ర కేబినెట్ నిర్ణయాలివే...



న్యూఢిల్లీ : ఖరీఫ్ కాలానికి సంబంధించిన పంటలకు కనీస మద్దతు ధరను పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. నువ్వుల మద్దతు ధర క్వింటాల్‌కు 452 రూపాయలను పెంచామని, మినుములు క్వింటాలుకు 300 రూపాయలకు పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందని జవదేకర్ తెలిపారు. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ భేటీ జరిగింది. ఈ సందర్భంగా జవదేకర్ మాట్లాడుతూ... వరి మద్దతు ధరను కూడా పెంచామని తెలిపారు. గతంలో 1,868 రూపాయలుండగా, ఈ ఖరీఫ్ కాలానికి గాను 1,940 రూపాయలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇక జొన్నలు, ఇతర తృణధాన్యాల కనీస మద్దతు ధరను కూడా పెంచుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు రైల్వే సిగ్నల్స్ వ్యవస్థ ఆధునికీకరణ విషయంలో కూడా కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 5 జీ స్పెక్ట్రమ్ అమలు కోసం 25,000 కోట్లను కేటాయిస్తున్నట్లు కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ ప్రకటించారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనులు పూర్తి కావాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. రైల్వేలకు 700 మెగాహెర్ట్జ్ బ్యాండ్‌లో ఐదు మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌ను అందిస్తామని, దీని ద్వారా కమ్యూనికేషన్ వ్యవస్థ బాగుపడుతుందని తెలిపారు. ప్రస్తుతం రైల్వే వ్యవస్థలో ఆప్టికల్ ఫైబర్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారని, దీని స్థానే స్పెక్ట్రమ్ వాడితే రేడియో కమ్యూనికేషన్ చాలా మెరుగుపడుతుందని జవదేకర్ తెలిపారు.

# కొత్త మార్పులతో జులై 1 నుంచి అమలు



తాడేపల్లి: వైఎస్ఆర్ బీమా పథకాన్ని జులై1 నుంచి కొత్త మార్పులతో అమలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 'వైఎస్ఆర్ బీమా' పథకంపై సీఎం వైఎస్ జగన్ తాడేపల్లిలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. ఆయన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు సీఎం జగన్ మాట్లాడుతూ.. మరణించిన వ్యక్తి కుటుంబానికి నేరుగా రాష్ట్ర ప్రభుత్వ సాయం అందిస్తుందని తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి (18-50ఏళ్లు) సహజంగా మరణిస్తే లక్ష, 18-70ఏళ్లు ఉన్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణస్తే రూ. 5లక్షల సాయం అందజేయాలని ఆదేశించారు.ఇక జులై 1 నుంచి కొత్త మార్పులతో వైఎస్ఆర్ బీమా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈలోగా సంపాదించే వ్యక్తుల మరణాలకు సంబంధించిన క్లెయిమ్‌లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జులై 1లోగా క్లెయిమ్‌లన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లో బీమా పరిహారం చెల్లించాలని సీఎం జగన్ అన్నారు. బీమా పరిహారంపై ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం జగన్ చెప్పారు. ఈ సమీక్షలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కొడాలి నాని, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మంత్రి గౌతమ్ రెడ్డి చెబుతున్నవన్నీ అవాస్తవాలే!: యనమల



అమరావతి: రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిపై మంత్రి గౌతమ్ రెడ్డి చెబుతున్నవన్నీ అవాస్తవాలే అని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ గత రెండేళ్లుగా పరిశ్రమలకు చెల్లించాల్సిన రూ.5వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉంచారని తెలిపారు. మత్స్యకారుల పేరుతో ఫిషింగ్ హార్బర్లను వైసీపీ బినామీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పారిశ్రామిక కారిడార్లలో భూసేకరణకు రూ.50వేలకోట్లు అవసరమైతే రూ. 1000కోట్లు కేటాయించారన్నారు. కారిడార్లలో ఇప్పటికి 20 శాతం భూసేకరణ కూడా పూర్తికాలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ అసమర్థ విధానాల కారణంగా రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి రేటు -2.58కి పడిపోయిందన్నారు. తెలుగుదేశం హయాంలో నాలుగేళ్లపాటు వరుసగా రెండంకెల వృద్ధిరేటు సాధించామని తెలిపారు.మూడు పారిశ్రామిక సదస్సులు నిర్వహించి రూ.15.45 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామన్నారు. గత రెండేళ్లలో మొత్తం రూ.17లక్షల కోట్ల విలువైన పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని చెప్పారు. కియా అనుబంధ పరిశ్రమలు, లులూగ్రూప్, ఆసియన్ పేపర్ మిల్స్ వంటివి పారిపోయాయన్నారు. రూ.11వేల కోట్లతో కడప స్టీల్ ప్లాంట్ నిర్మిస్తామని బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయించారని తెలిపారు. రాష్ట్రంలో లక్షకుపైగా ఎంఎస్ఎంఇలు ఉంటే కేవలం 12వేలకు మాత్రమే రీస్టార్ట్ ప్యాకేజి ఇచ్చారని మండిపడ్డారు. రెండేళ్లలో సాధించిన ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేయాలని యనమల రామకృష్ణుడు డిమాండ్ చేశారు.

# ఉత్తర బంగాళాఖాతంలో ఈనెల 11న అల్పపీడనం!

అమరావతి: ఉత్తర బంగాళాఖాతంలో ఈనెల 11న అల్పపీడనం ఏర్పడే అవకాశం వాతావరణ శాఖ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఇక నేడు(బుధవారం), రేపు( గురువారం) రాయలసీమలో పలుచోట్ల వర్షాలు పడే అవకాశం వాతావరణ శాఖ పేర్కొంది. కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. హుస్నాబాద్, అక్కన్నపేట,



కొహెడ మండలాల్లో భారీ వాన పడింది. మేడ్చల్, సిరిసిల్ల, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో భారీ వర్షం కురవడంతో పలు రోడ్లు, లోతట్టు పాంతాల్లో వాన నీరు నిలిచింది. ఇక రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు రానున్న రెండు మూడు రోజుల్లో రాష్ట్రమంతటా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రానికి పశ్చిమ దిశ నుంచి గాలులు వీస్తున్నట్లు తెలిపింది. ఈనెల 11న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించింది. ఈనెల 11 నుంచి 13 వరకు భారీ వర్షాలు నమోదవుతాయని, ఉత్తర, తూర్పు ప్రాంతంలోని జిల్లాల్లో అతిభారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశాలున్నాయని వివరించింది. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. రాగల 48 గంటల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి వర్షాలు నమోదయ్యే అవకాశాలున్నాయని వివరించింది.

# పంటల ప్రణాళికకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి: కన్నబాబు

## వ్యవసాయ అధికారులతో మంత్రి కన్నబాబు సమీక్ష



విజయవాడ: పంటల ప్రణాళికలకు ఈ ఏడాది నుంచి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. బుధవారం ఆయన వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా ఖరీఫ్ సన్నద్ధత, వైఎస్సార్ పొలంబడి, విత్తనాలు, ఎరువుల సరఫరాపై మంత్రి సమీక్షించారు.ఆర్బీకేల మౌలిక సదుపాయాల కల్పనపై సూచనలిచ్చారు. క్రాప్ ప్లానింగ్, ప్రత్యామ్నాయ పంటలపై జేసీలు దృష్టి సారించాలన్నారు. జులై 8న వైఎస్సార్ జయంతిని రైతు దినోత్సవంగా నిర్వహిస్తున్నామని.. జులై 8న కస్టమ్ హైరింగ్ సెంటర్లు, హబ్‌లు ప్రారంభిస్తామని తెలిపారు. వరికి సంబంధించి సూక్ష్మ స్థాయిలో ప్రణాళికలు చాలా ముఖ్యమని, బోర్ల కింద పండించే వరి పంటలకి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని కన్నబాబు అన్నారు.

# మోదీ, ఉద్ధవ్ ఠాక్రే భేటీపై శివసేన వివరణ



ముంబై : రాజకీయ అనుబంధాలు ఎలా ఉన్నా వ్యక్తిగత సంబంధాలకు తమ పార్టీ విలువ ఇస్తుందని శివసేన పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీతో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ముఖాముఖి భేటీపై స్పందిస్తూ శివసేన ఈ వ్యాఖ్యలు చేసింది. వ్యక్తిగత సంబంధాలు, ప్రొటోకాల్ లో భాగంగానే ప్రధాని మోదీతో ఠాక్రే సమావేశమయ్యారని శివసేన స్పష్టం చేసింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాషాయ పార్టీతో తెగతెంపులు చేసుకున్న శివసేన ఆపై ఎన్సీపీ, కాంగ్రెస్ లతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సేన, బీజేపీల మధ్య సంబంధాలు బెడిసికొట్టిన క్రమంలో ప్రధాని మోదీతో ఉద్ధవ్ భేటీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఠాక్రే ఢిల్లీ పర్యటన రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేదని, మహారాష్ట్రలో పెండింగ్ ప్రాజెక్టు లు ఇతర పనులను కేంద్రం నుంచి సాధించుకునేందుకే ఆయన హస్తిన టూర్ సాగిందని పార్టీ పత్రిక సామ్నా సంపాదకీయంలో శివసేన పేర్కొంది. ప్రధానితో ఠాక్రే భేటీ సామరస్య వాతావరణంలో ఫలవంతంగా జరిగిందని స్పష్టం చేసింది.

# సీఎం జగన్‌ను కలిసిన 'డీఎస్సీ-2008' అభ్యర్థులు


తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 'డీఎస్సీ-2008' అభ్యర్థులు కలిశారు. తమకు జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రికి డీఎస్సీ అభ్యర్థులు వివరించారు. న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని వారికి సీఎం వైఎస్ జగన్ తెలిపారు.అనంతరం ఏపీ




ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, 2008 డీఎస్సీలో అభ్యర్థులకు జరిగిన నష్టాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లామని, కాంట్రాక్ట్ బేసిక్ మీద తీసుకోవాలని సీఎం నిర్ణయించారని తెలిపారు. సీఎం జగన్ నిర్ణయంతో 2,193 మందికి లబ్ధి చేకూరిందన్నారు. సచివాలయం ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని కోరామని.. రెగ్యులర్ చేయాలని అధికారులకు సీఎం జగన్ ఆదేశాలిచ్చారని వెంట్రామిరెడ్డి వెల్లడించారు.

# దేవాలయాలను కాపాడేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం





విజయనగరం: దేవాలయాల పరిరక్షణపై దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు బుధవారం విజయనగరంలో మీడియాతో మాట్లాడారు. " దేవాలయాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. అన్యక్రాంతం అవుతున్న దేవాదాయశాఖ భూములను కాపాడుకునే దిశగా జిల్లాల వారిగా సమీక్షలు నిర్వహిస్తున్నాం. దేవాలయాలకు సంబందించిన కమర్షియల్ స్థలాలు అభివృద్ధి చేసి, ఆదాయాన్ని పెంచుకుంటాం. అనేక భూములు చంద్రబాబు దారాదత్తం చేశారు. ఆక్రమణలు జరగకుండా పరిరక్షణ కు చర్యలు చేపడుతున్నాం. 40 వేల సీసీ కెమారాలను ఆలయాల వద్ద అమర్చడం జరిగింది.విమర్శమకు తావివ్వకుండా టెంపుల్ వద్ద భద్రతపెంచి జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నలభై టెంపుళ్లను చంద్రబాబు కూలిస్తే జగన్ పునఃనిర్మాణం చేసేందుకు పూనుకున్నారు'' అని తెలిపారు.మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. '' దేవాలయాలపై సమీక్ష జరగడం ఇదే తొలిసారి. జిల్లాల వారీగా సమీక్ష చేసి వాస్తవ పరిస్థితు లు తెలుకోవడం మంచిదే.. ఇందుకు అభినందిస్తున్నాను.. వంద ఇళ్ల వద్ద ఒక ఆలయం నిర్మించాలనడం మంచి నిర్ణయం. . ఇందుకు పది లక్షలు ఇస్తుంది.. జగనన్న కాలనీలు నిర్మాణం జరుగుతుంది. ఇక్కడ అన్ని వర్గాలు వారు ఉంటారు.. ఇవి పెద్ద గ్రామాలుగా మారనున్నాయి. జిల్లాలో వంద గ్రామాలలో నామ్స్ ప్రకారం గుడ్లుకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నా. ఏసీ ఆఫీసు నిర్మాణం చేయాలని నిర్ణయించారు.. ఇందు కు మా సహకారం అందుతుంది

# ఇసుక, మైనింగ్‌పై సమీక్ష నిర్వహించిన మంత్రి పెద్దిరెడ్డి

అమరావతి: ఇసుక, మినరల్ కన్సెషన్ అప్లికేషన్లు, మైనింగ్‌పై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం రోజున సమీక్ష నిర్వహించారు. ఇకపై జిల్లాల వారీగా ఔట్‌సోర్సింగ్ ద్వారా సీనరేజీ కలెక్షన్లు ఉంటాయని మంత్రి తెలిపారు. వాల్యూమెట్రిక్



బదులు వెయిట్ బేసిస్‌లో సీనరేజీ వసూళ్లకు ప్రణాళికలను సిద్ధం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా జగనన్న కాలనీలకు ఉచిత ఇసుక కోసం ప్రత్యేక కూపన్లను ఇవ్వాలని అధికారులకు సూచించారు.మైనర్ మినరల్స్ లీజులను ఈ-ఆక్షన్ ద్వారా కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు. శాస్త్రీయ విధానంలో మైనింగ్ లీజుల పెంపుదలకు ప్రభుత్వం యోచిస్తోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి తెలిపారు.

# కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా అనూప్‌చంద్ర పాండే బాధ్యతల స్వీకరణ




ఢిల్లీ : కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనూప్‌చంద్ర పాండే బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనూప్‌చంద్ర పాండేను ఎన్నికల కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. అనూప్ చంద్ర 1984 బ్యాచ్ ఉత్తరప్రదేశ్ క్యాడర్ అధికారి. ప్రస్తుతం సుశీల్ చంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ కాగా, సభ్యులుగా రాజీవ్‌కుమార్, అనూప్‌చంద్ర పాండే ఉన్నారు.

# సంపాదకీయం

గురువారం 10 జూన్ 2021

## లక్షద్వీప్ లెక్కేంటీ...

ప్రధాని నరేంద్రమోడీది ఒక విలక్షణ శైలి. ఎవరేమనుకున్నా లెక్క చేయని ధోరణి. ముఖ్యమంత్రిగా గుజరాత్ ను అదే విధంగా పరిపాలించారు. సక్సెస్ సాధించారు. ప్రధానిగా భారత్ నూ అదే తరహా పాలనతో ముందుకు తీసుకెళ్లాలనుకున్నారు. తొలి అయిదేళ్ల కాలంలో అనుకున్నది సాధించారు. ప్రజలు మరోమారు పట్టం గట్టారు. పరిపాలన వైఫల్యాలు, తాము ఎదుర్కొన్న కష్టాలు అన్నిటినీ పక్కన పెట్టారు. ప్రధానిలో కనిపించిన నిజాయతీ, కుటుంబ వారసత్వం లేకపోవడంతో భవిష్యత్తులో తమకు మంచి జరుగుతుందని విశ్వసించారు. కష్టాలు తాత్కాలికమేనని సర్దుకుపోయారు. అయితే ఆ భ్రమలు తొలగిపోతున్నాయి. కళ్లెదుల కఠినమైన నిజాలు నివ్వెరపరుస్తున్నాయి. గత కాలంలో ప్రధానులెవరిలోనూ పెద్దగా కనిపించని ప్రాంతీయ తత్వం పై ప్రధాని పీఠంపైనే విమర్శల జడివాన కురుస్తోంది. ఆయన గుజరాత్ కు ముఖ్యమంత్రి కాదు, దేశానికి ప్రధాని. ఇంకా ఆ రాష్ట్రం పట్ల ప్రత్యేకాసక్తి చూపిస్తూ మిగిలిన రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించేది లేదంటూ స్వరాలు పెరుగుతున్నాయి. అతి తక్కువ జనాభాతో ఆహ్లాదకరమైన పర్యాటకానికి పేరెన్నిక గన్న ప్రాంతం లక్షద్వీప్. గుజరాత్ కు చెందిన రాజకీయ వేత్తను తెచ్చి పాలకునిగా నియమించేసింది కేంద్రం. ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ఉండాల్సిన అధికారాలన్నిటినీ ఆయన క్రమేపీ ఆక్రమించేశారు. పర్యాటకానికి ప్రోత్సాహం పేరిట మద్యం ఏరులై పారేలా విధానం తెచ్చి పెట్టారు. మౌలిక వసతుల పేరిట స్తానికుల ఆస్తులను అడ్డగోలుగా ఆక్రమించుకునే విధానాలకూ తెర తీశారు. ఇవన్నీ ప్రజల్లో ఆందోళనకు దారి తీస్తున్నాయి. ఈ దీవులతో సంబంధ బాంధవ్యాలు నెరిపే కేరళ ప్రభుత్వం ఇప్పటికే ఆగ్రహావేశాలు వ్యక్తం చేసింది. అసెంబ్లీలో తీర్మానమే చేసింది. ఇప్పుడు తమిళనాడు సైతం దానికి జత కూడింది. మరోవైపు వందమందికి పైగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు అడ్మినిస్ట్రేటర్ విధానాలను తప్పుపడుతూ ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాశారు. గుజరాతీ పాలకుడిని వెంటనే వెనక్కి పిలిపించాలని రాజకీయ పార్టీలు రాష్ట్రపతిని కోరుతున్నాయి. చినికి చినికి గాలివానగా తయారైన లక్షద్వీప్ ఉదంతం మరోసారి ప్రధాని పక్షపాతాన్ని వెలికి తీస్తూ ప్రశ్నలు రేకెత్తిస్తోంది. రాజకీయవేత్తలను పాలకులుగా నియమించడం కంటే పరిపాలన అనుభవం ఉన్న రిటైర్డ్ అధికారులకు బాధ్యతలు అప్పగిస్తే బాగుండేదనేది కొందరి సూచన. అసలు గుజరాత్ నాయకులు తప్ప దేశంలో సమర్థులెవరూ లేరన్నట్లు కీలక బాధ్యతలు వారికి మాత్రమే ఎందుకు అప్పగించాలనేది రాజకీయంగా ఎదురవుతున్న సవాల్. ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర ప్రభుత్వం దీనిపై ఎలా స్పందించి, ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటాయో వేచి చూడాలి.సొంత రాష్ట్రంపై అభిమానం తప్పు కాదు. కానీ అధి పరిధులు దాట కూడదు. అన్ని రాష్ట్రాలకు కుటుంబ పెద్ద తరహాలోనే ప్రధాని వ్యవహరించాలి. తాజాగా లక్షద్వీప్ లో ప్రఫుల్ పటేల్ అనే గుజరాతీ మాజీ రాజకీయవేత్త సృష్టిస్తున్న అలజడి పీఎం నరేంద్రమోడీపై విపక్షాల విమర్శలకు మరో అస్త్రాన్ని సమకూర్చి పెట్టింది.ఒక ఇంట్లో అమ్మానాన్న కూడా పిల్లలందరిపై సమానమైన ప్రేమాభిమానాలు కనబరచ లేరు. కొందరు ఫేవరెట్ కిడ్స్ ఉంటారు. వారి ప్రవర్తన , చెప్పిన మాట వినేతీరు, క్రమశిక్షణ కారణంగా కొందరు అభిమాన పాత్రులైన ప్రియమైన బిడ్డలు ఉంటుంటారు. అయినా సహజంగా తల్లిదండ్రులు సౌకర్యాలు, విద్య విషయాల్లో అందరికీ సమన్యాయం చేసేందుకే చూస్తారు. భారత ప్రధాని నరేంద్ర మోడీలో అదే లోపిస్తుందనే విమర్శలు పెరిగిపోతున్నాయి. తన రాజకీయ జీవితానికి ఆలంబన, ఎదుగుదలకు మూలం గుజరాత్ రాష్ట్రమే. అందులో ఎటువంటి సందేహం లేదు. మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్ వంటి నేతలను అందించిన రాష్టమది. నరేంద్రమోడీ సొంత రాష్ట్రంపై మక్కువ చూపడాన్ని పెద్దగా తప్పు పట్ట లేం. కానీ ప్రాంతీయ పార్టీల నేతల స్థాయిలో ప్రాధాన్యమివ్వడమే ఆరోపణలకు తావిస్తోంది. గతంలో లాలూ ప్రసాద్, మమత బెనర్జీ వంటి నాయకులు రైల్వేశాఖను నిర్వహించినప్పుడు తమ రాష్ట్రాలకు పెద్ద పీట వేసేవారు. విమర్శలు వచ్చినా లెక్క చేసేవారు కాదు. అవసరమైతే అప్పటి ప్రధానులను సైతం ధిక్కరించేవారు. వారికి అలా చెల్లుబాటయ్యింది. అదే తీరులో వారు అపప్రథలను కూడా మూటగట్టుకున్నారు. దేశానికి ఎక్కువ మంది ప్రధానులను అందించిన రాష్ట్రం ఉత్తరప్రదేశ్. జనాభాలోనూ పెద్దది. అయినా గతంలో అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన ప్రధానులెవరూ ఉత్తరప్రదేశ్ కు మాత్రమే ఎక్కువ చేస్తున్నారనే విమర్శలు తెచ్చుకోలేదు. నిజానికి ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ కూడా ఉత్తరప్రదేశ్ నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.ప్రధాని నరేంద్రమోడీ అందర్నీ విశ్వసించరు. తన రాష్ట్రానికి చెందిన , తనతో కలిసి పనిచేసిన వారి పట్లనే ఆయనకు నమ్మకం మెండు. అందుకే ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జాతీయంగా కీలక పదవుల్లో గుజరాతీలకు పెద్ద పీట వేస్తూ వచ్చారు. ప్రధానమంత్రి కార్యాలయంలోనూ వారి మాటే చెల్లుబాటవుతుంది. ఆర్థిక, రాజకీయ సలహాలు, సూచనలు అన్నిటా వారి మాటే వేదంగా ప్రధాని భావిస్తారనేది బీజేపీలోనూ కొందరు చేసే వాదన. అంతవరకూ ఫర్వాలేదు. కానీ సొంత రాష్ట్రానికి అధికంగా ప్రయోజనం కల్పించి ఇతర రాష్ట్రాలకు అన్యాయం చేస్తే మాత్రం రాజకీయ నేతలు చూస్తూ ఊరుకోరు కదా. తాజాగా అదే జరుగుతోంది. కరోనా వంటి విపత్కర పరిస్తితుల్లో గుజరాత్ కు వాక్సిన్లు, సహాయం కేంద్రం నుంచి ఎక్కువగా లభించిందంటూ ప్రత్యర్థి రాజకీయ నేతలు ఆరోపణలు గుప్పించారు. అంతటితో అయిపోలేదు. ఇటీవలి తుపానుల్లోనూ ప్రధాని నరేంద్రమోడీ గుజరాత్ కు ఎక్కువ మొత్తం కేటాయించి అధికంగా దెబ్బతిన్న ఇతర రాష్ట్రాలకు మొండి చెయ్యి చూపించారంటూ మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. ఈ విమర్శలకు బీజేపీ దీటుగా బదులివ్వలేకపోయింది. జాతీయ నాయకుడిగా ప్రాంతీయ పక్షపాతాలకు, రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించాలి. అయితే నరేంద్రమోడీపై పడుతున్న ముద్ర కచ్చితంగా రాజకీయంగా నష్టం తెచ్చి పెడుతుంది. ప్రత్యర్థి పార్టీల పోలరైజేషన్ కు , ఇతర రాష్ట్రాల్లో మోడీ వ్యతిరేకత ప్రబలేందుకు ఒక అస్త్రంగా ఉపయోగపడుతుంది.

# దీక్షా స్థలిగా విశాఖ

విశాఖపట్టణం, జూన్ 9, (న్యూస్ పల్స్)విశాఖను ఇప్పటిదాకా పలు రకాలుగా కీర్తించారు. ఆర్థిక రాజధాని అన్నారు, పర్యాటక సినీ రాజధాని అని కితాబు ఇచ్చారు. సాంస్కృతిక రాజధాని అని కూడా గర్వించారు. ఐట్ హబ్ అని ముచ్చట చేశారు, ఇక జగన్ ఇవన్నీ కాదు కానీ పరిపాలనా రాజధానిగా విశాఖ ఉంటుందని డైరెక్ట్ గా చట్టమే చేశారు. మరి దాని మహత్యమో మరేమో కానీ విశాఖ మాత్రం ఇపుడు సడెన్ గా రాజకీయ రాజధానిగా మారిపోయింది. ఏ నేత అయినా విశాఖ వచ్చి రచ్చ చేయాలని చూస్తున్నాడు. ఇక్కడ నుంచే తన గొంతు సవరిస్తున్నాడు.విశాఖ మీద నాయకలులకు బాగా మోజు పెరిగింది. జగన్ రాజధాని అంటున్నాడు కాబట్టి ముందే జాగా లాగేసి పాగా వేయాలన్న ఉబలాటం కూడా ఎక్కువ అయినట్లుంది. అందుకే విశాఖ నుంచే ఉద్యమం అంటున్నారు. విశాఖ నడిబొడ్డునే నిలబడి గర్జిస్తున్నారు. జగన్ కి విశాఖ మీద అటెన్షన్ ఉండడం వల్ల తాము ఇక్కడ అన్న ప్రతీ మాట ఆయన చెవులకు నేరుగా చేరుతుందన్న వ్యూహం కావచ్చు మరోటి కావచ్చు కానీ నేతాశ్రీలు అంతా విశాఖ చుట్టూ ప్రదక్షిణమే చేస్తున్నారు.ఎక్కడో కర్నూలు జిల్లాకు చెందిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ వంటి వారు కూడా విశాఖనే తమ కార్యక్షేత్రంగా ఎన్నుకుంటున్నారు. విశాఖ నుంచి గత ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన అనుభవాన్ని కూడా రంగరించి ఆయన ఉక్కు ఉద్యమానికి ఊపిరిలూదుతున్నారు. విశాఖలోనే మకాం వేసి మారీ పోరాటానికి పదును పెడుతున్నారు. ఇక మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటి వారు తరచూ విశాఖకే వస్తూ ప్రభుత్వం మీద హాట్ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే వామపక్ష నేతలతో పాటు పీసీసీ ప్రెసిడెంట్ శైలజానాథ్ కూడా అనంతపురం జిల్లా నుంచి ఆయాసపడి మరీ విశాఖ వచ్చి విడిది చేస్తున్నారు.మొత్తానికి విశాఖని ఉద్యమ భూమిగా దీక్షాస్థలిగా మార్చేస్తున్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు నిరసనగా టీడీపీ నేత పల్లా శ్రీనివాస్ ఆ మధ్య అమరణ దీక్ష చేపడితే టెన్త్, ఇంటర్ పరీక్షలు కరోనా టైమ్ లో నిర్వహించవద్దు అంటూ ప్రజా శాంతి ప్రెసిడెంట్ కె ఎ పాల్ కూడా విశాఖలో ఆమరణ దీక్షను చేపట్టడం విశేషం. ఇదే రూట్ లో మరికొందరు నేతలు ఇతర ప్రజా సమస్యల మీద విశాఖ నుంచే సమర శంఖారావం పూరించనున్నారు. మొత్తానికి జగన్ రాజధాని అని మాత్రమే అన్నారు. ఆయన మాత్రం తాడేపల్లిలోనే ఉన్నారు. కానీ జగన్ మనసెరిగిన ఏపీ రాజకీయం మాత్రం విశాఖే పొలిటికల్ క్యాపిటల్ అంటోంది. మరి చూడాలి రానున్న రోజుల్లో విశాఖ మరెంతగా సెగలూ పొగలూ పుట్టిస్తుందో.

# మూడో పంటకు సిద్ధమౌతున్న రైతాంగం



ఏలూరు, జూన్ 9, (న్యూస్ పల్స్)వ్యవసాయరంగం పరుగులు పెడుతోంది. సాగులో ఖర్చులు తగ్గించి, నాణ్యత పెంచేందుకు ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేసింది. జిల్లాలో మూడోపంట వేసేదిశగా ముందస్తు సాగుకు శ్రీకారం చుట్టారు. వర్షాలు అంత ఆశాజనకంగా లేకపోయినా రైతుల కృషి కూడా ప్రభుత్వానికి తోడవుతుండటంతో మూడోపంటకు ఆస్కారం ఏర్పడుతోంది. ఉన్నకొద్దిపాటి నీటితోనే మంచి ఫలితాలు సాధిస్తున్నారు. తద్వారా దిగుబడి పెరిగి ఉత్పాదకత పెరిగింది. చేపల చెరువులు ఏర్పడటంతో విస్తీర్ణం తగ్గినా ఉత్పాదకత పెరిగి రైతుల ఆశలకు ఊపిరిపోసింది. గత రెండేళ్లలో ఎకరాకు 40 నుంచి 55బస్తాల వరకు దిగుబడి వస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్లలో రెండంకెల వృద్ధి నమోదు చేసుకుంటోంది. మూడేళ్లుగా మూడోపంటకు ఆస్కారం ఏర్పడుతోంది.ప్రభుత్వం భావించడంతో సాంకేతిక వ్యవసాయానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో సంప్రదాయ వ్యవసాయం స్థానే యాంత్రిక, అత్యాధునిక పద్ధతుల దిశగా అడుగులు వేయించింది. గత రబీలో 13.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. అదే ఖరీఫ్‌లో 13.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది. ప్రస్తుత ఖరీఫ్‌లో 14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యంగా ప్రణాళిక నిర్దేశించుకున్నారు. రబీలో పంట కోత ప్రయోగంలో 46బస్తాల వరకు దిగుబడి వచ్చింది. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం చూస్తే.. ఎకరాకు రికార్డుస్థాయిలో 60 నుంచి 70 బస్తాల దిగుబడి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది విస్తీర్ణం తగ్గి వృద్ధిరేటు స్వల్పంగా తగ్గినప్పటికీ, ఉత్పాదకత మాత్రం పెరిగింది. ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. గత ఏడాది 15వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో 25వేల హెక్టార్లలో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రుణాల విషయంలో కూడా అధికారులు ప్రణాళికాయుతంగా ముందడుగు వేస్తున్నారు. రూ. 2వేల కోట్ల రుణాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు బ్యాంకర్ల ద్వారానే రుణాలు ఇస్తుండగా, ఖరీఫ్ నుంచి సొసైటీల ద్వారా రుణాలు ఇవ్వనున్నారు. ఇటీవల జరిగిన బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకుంది. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో 2.26లక్షల హెక్టార్ల వరకు వరిసాగు చేస్తున్నారు. రబీలోనూ ఇంచుమించుగా అంతే విస్తీర్ణం ఉన్నా.. పంటలే మారుతుంటాయి. మిగిలిన పంటలతో కలిపి మొత్తంగా 2.46 లక్షల హెక్టార్ల నుంచి 2.50 లక్షల హెక్టార్ల వరకు సాగవుతుంది.చింతలపూడి ఎత్తిపోతల పథకం కింద రూ.4,909 కోట్లతో మూడు ఎత్తిపోతలు నిర్మించనున్నారు. దీనిలో ఇంతవరకు రెండు ఎత్తిపోతలు పూర్తి చేశారు. మూడోది పట్టిసీమ వద్ద నిర్మించనున్నారు. అవి నిర్మాణం పూర్తయ్యితే రెండు లక్షల ఎకరాలకు సాగునీరు. 191 గ్రామాలకు తాగునీరు అందనుంది. 15.50 టీఎంసీల నీటిని ఎత్తిపోయనున్నారు. 68 కిమీల మేర ప్రధాన కాలువ తవ్వుతారు.

# కొనసీమలో మరో కాలుష్య పరిశ్రమ

కాకినాడ, జూన్ 9, (న్యూస్ పల్స్)కొబ్బరి, జీడి, మామిడి తోటలు, వరి, చెరకు వంటి పంటలకు నిలయమై, మినీ కోనసీమగా పేరుగాంచిన నక్కపల్లి మండలంలో ఇప్పటికే ఉన్న కాలుష్య కారక పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతుంది. ఇప్పటికే చేపల చెరువుతోభూగర్భ జలాలు కలుషితమైతే ఆ నీటిని తాగే ప్రజలు రోగాల బారిన పడనున్నారు. హెటిరో పరిశ్రమ ఏర్పాటు కానున్న ప్రాంతానికి ఆనుకొని కొబ్బరి, జీడి, మామిడి తోటలతో పాటు పచ్చని పొలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని మినీ కోనసీమగా పిలుస్తారు. బోర్లు తవ్వించుకొని తోటలను పెంచుకుంటూ వాటిపై వచ్చే ఆదాయంతో ఈ ప్రాంత రైతులు జీవిస్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటైతే వచ్చే కాలుష్యానికి ఈ తోటలు దెబ్బతింటాయని, తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారుమండలంలోని డిఎల్.పురం సర్వే నెంబర్ 3, 4, 5, 9 నుండి 14 వరకు 70.4 ఎకరాల జిరాయితీ భూమిలో మెసర్స్ బిఎస్‌జి కెమికల్స్ అండ్ ఫార్మా స్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టేందుకు విశాఖపట్నం కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ప్రకటన జారీ చేసింది. రూ.15.60 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమ నెలకు 50 టన్నుల సామర్థ్యం గల బహుళ ఔషధాలు, ఔషధ ఇంటర్మీడియట్స్, బహుళ ప్రయోజన రసాయనాలు, కస్టమ్ సింథసిస్, ఆర్ అండ్ డి తదితర ఉత్పత్తులు చేయనుంది. రోజుకు 121.5 కిలో లీటర్ల నీటి అవసరం ఉంటుందని, వర్షపు నీటిని శుభ్రపరిచి ఉపయోగించుకోవడం వల్ల 65.0 కిలో లీటర్లకు తగ్గించడం జరుగుతుందని, వర్షపు నీటిని సేకరించి నిలువ చేసి ఉపయోగించడం జరుగుతుందని తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా రోజుకు 71.1 కిలో లీటర్ల వ్యర్థ నీరు వెలువడుతుందని, ఆధునిక సాంకేతిక యంత్రాలను ఉపయోగించి వ్యర్థ జలాలను శుభ్ర పరిచి తిరిగి వాడుకోనుందని ఆ ప్రకటనలో వెల్లడించారు. ఇది ఎంత వరకు సాధ్యమని మేధావులు ప్రశ్నిస్తున్నారు.పరిశ్రమలు ఏర్పాటు చేయాడానికి ముందు యాజమాన్యాలు చెబుతున్నవి తరువాత పాటించడం లేదు. ఇక్కడ వర్షపు నీటిని నిల్వ చేయడం సాధ్యం కాకపోతే పెద్ద ఎత్తున బోర్లు తీస్తారు. దీని వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతాయి. చుట్టు పక్కల రైతుల బోర్లకు నీరందే పరిస్థితి ఉండదు. అలాగే వ్యర్థ జలాలను శుద్ధి చేసి ఉపయోగిస్తారా అన్న అనుమానం కలుగుతుంది. ఇది అధిక మొత్తం ఖర్చుతో కూడికున్న పనికి కనుక భూమిలోకి ఇంకించడంగాని, సముద్రంలోకి వదిలేయడంగాని చేయొచ్చు. ప్రస్తుతం జిల్లాలోని తీర ప్రాంతంలో ఉన్న ఫార్మా కంపెనీలు ఇలాగే చేస్తున్నాయి. పరవాడ ఫార్మా కంపెనీలు వ్యర్థ జలాలను వదిలేయడం వల్ల చుట్టూ ఉన్న చెరువులు, భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. సముద్రంలో చేపలు కనుమరుగయ్యాయి.డిఎల్.పురం, నెల్లిపూడి, గునుపూడి, బంగారమ్మపేట, అమలాపురం, ఉద్దండపురం, వేంపాడు గ్రామాలకు అతి సమీపంలో ఈ ఫార్మా కంపెనీని ఏర్పాటు చేస్తే దీని వల్ల వచ్చే వాయు, జల కాలుష్యం వల్ల ప్రజలు పూర్తిగా అనారోగ్యాల బారినపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఇటువంటి ఫార్మా కంపెనీలు ఉన్న పరవాడ ఫార్మా సిటీ, నక్కపల్లి హెటిరో డ్రగ్స్, పాయకరావుపేట డెక్కన్ కంపెనీల చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అలాగే పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు మృత్యువాత పడుతున్నారు. ఆ సమయంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని బిక్కుబిక్కు మంటూ జీవిస్తున్నారు. పరిశ్రమ పరిధిలో 10 గ్రామాలున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ఈ పది గ్రామాల్లో సుమారు 25 వేలకు పైగా జనాభా ఉంది. పరిశ్రమ ఏర్పాటుకు కూసింత దూరంలో సముద్రతీరం ఉంది. డిఎల్.పురం వాడపేట, బంగారమ్మపేట మత్స్యకారులు సముద్రంలోకి చేపలు వేటకు వెళ్తూ ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం వల్ల చేపలు మృత్యువాత పడతాయని, దీని వలన తమ ఉపాధి దెబ్బతింటుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జనసేన ఆధ్వర్యంలో జిజిహెచ్ లో 26 రోజులుగా అన్నదానం

నెల్లూరు జనసేన ఆధ్వర్యంలో నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లో గత 26 రోజులుగా రోగులకు, సహాయకులకు అన్నదానం చేస్తున్నారు. అంతేకాకుండా ఆసుపత్రి ప్రాంగణంలో అన్ని పేద ప్రజల దాహార్తిని తీర్చేందుకు మినరల్ వాటర్ క్యాన్లను అందుబాటులో ఉంచడమే కాకుండా 3 పూటలా త్రాగు నీరు అందే విధంగా తగిన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే బుధవారం 26వ రోజు జీజీహెచ్ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జనసేన నాయకులు గునుకుల కిషోర్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, జిల్లా ఇన్చార్జి మను క్రాంత్ రెడ్డి సూచనలు సలహాలతో, దాతల సహకారంతో 26 రోజులుగా నిర్విఘ్నంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. కరోనా వైరస్ నేపథ్యంలో నెల్లూరు నగరంలో లాక్ డౌన్ అమల్లో ఉన్నందున హోటల్స్ తెరవక , ఆహారం దొరక్క నిరు పేద ప్రజలు, రోగులు అనేకమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసి, ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. లాక్ డౌన్ ఎత్తివేసే వరకు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించాలన్న పార్టీ అధినేతల ఆదేశాల మేరకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఇటువంటి విపత్కర ఆపత్కాల సమయాలలో ప్రతి ఒక్కరు తమవంతు చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా జి హెచ్ లో క్యూలైన్ల ద్వారా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రశాంత్ గౌడ్, కోట బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లో బియ్యానికి కృత్రిమ కొరత

విశాఖపట్టణం, జూన్ 9, (న్యూస్ పల్స్)నిత్యావసరాల ధరలు నింగిలో విహరిస్తున్నాయి.. బియ్యం ధరలే కాస్త అందుబాటులో ఉన్నాయనుకుంటే అవీ భారమవుతున్నాయి.మార్కెట్లో బియ్యానికి డిమాండ్ కృత్రిమ కొరత సృష్టించి, ధర పెరగడానికి దోహదపడుతున్నట్టు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, సరుకులు, కూరగాయల ధరలు భారంగా మారిన నేపథ్యంలో ఇప్పుడు బియ్యం రేట్లు కూడా వాటితో పోటీపడుతుండడంపై వినియోగదారుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. అధికారులు రంగంలోకి దిగి బియ్యం ధరలను కట్టడి చేయాలని కోరుతున్నారు. దాదాపు నెల రోజుల నుంచి బియ్యం ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. క్వింటాలుకు రూ.500, పాతిక కిలోల బ్యాగ్‌పై రూ.100కు పైగా పెరిగాయి. సాధారణంగా మార్చి నుంచి బియ్యం ధరలు అందుబాటులో ఉంటాయి. మునుపటికంటే తగ్గుతాయి. ఎందుకంటే.. జనవరితో పంట చేతికొస్తుంది. రైతులు అప్పట్నుంచి ధాన్యాన్ని రెండు నెలల పాటు నిల్వ ఉంచుతారు. వాటిని వ్యాపారులు కొనుగోలు చేసి మిల్లుల్లో మర పట్టించి మార్కెట్‌కు తరలిస్తారు.ఫలితంగా జులై, ఆగస్టు నెలల వరకు బియ్యం ధరలు కాస్త తగ్గుముఖం పడతాయి. అయితే అందుకు భిన్నంగా ఇప్పుడు బియ్యం ధరలు పెరుగుతున్నాయి. మిల్లర్లు సిండికేట్ అయి బియ్యం సరఫరాలో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ధాన్యం లభ్యత ఆశించినంతగా లేకపోవడంతో బియ్యం ధరలు పెంచక తప్పడం లేదని మిల్లర్లు చెబుతున్నారు. వాస్తవానికి బియ్యాన్ని ప్రభుత్వానికి లెవీ ఇస్తున్నందున ఆ లోటును భర్తీ చేసుకోవడానికి మిల్లర్లు ధరలు పెంచుతున్నారని వ్యాపారులు అంటున్నారు. మరోవైపు వేసవికాలంలో ధాన్యం మరపట్టిస్తే నూక ఎక్కువగా వచ్చి బియ్యం దిగుబడి తగ్గుతుందన్నది మరో వాదన. దీన్ని దృష్టిలో ఉంచుకుని కూడా మిల్లర్లు నష్టపోకుండా బియ్యం ధరలు పెంచుతుంటారని అంటున్నారు. కాగా రానున్న రెండు, మూడు నెలల వరకు వీటి ధరల పెరుగుదల కొనసాగవచ్చని, ప్రస్తుతంకంటే ఒకింత ఎగబాకే అవకాశం ఉందని బియ్యం వ్యాపారులు చెబుతున్నారు. విశాఖ నగరంలో రోజుకు సగటున 4 లక్షల కిలోల బియ్యం వినియోగమవుతుందని అంచనా. ఈ డిమాండ్‌కు తగ్గట్టుగా ప్రస్తుతం సరుకు మార్కెట్‌కు రావడం లేదు. మిల్లర్ల ముందస్తు వ్యూహంలో భాగంగా సరుకును తగ్గిస్తున్నట్టు చెబుతున్నారు.

# ఇలా అయితే ఎలా

### తమ్ముళ్లో అంతర్మథనం

గుంటూరు, జూన్ 9, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కేవలం రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తారు. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ప్రజా సమస్యలపై ఆయన స్పందించి దాదాపు ఏడాదికి పైగానే అవుతుంది. కేవలం ఎన్నికల సమయంలో తప్ప చంద్రబాబు సమస్యలపై క్షేత్రస్థాయిలోకి రారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు సయితం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ప్రజల్లోకి రాకుంటే పార్టీ కోలుకోవడం కష్టమేనన్న పెదవి విరుపులు వినపడుతున్నాయి.చంద్రబాబు గత ఏడాదిన్నరగా హైదరాబాద్ కే పరిమితమయ్యారు. జగన్ విపక్షంలో ఉన్నప్పుడు లోటస్ పాండ్ లో ఉన్న జగన్ తనను విమర్శించే అర్హత లేదన్నారు. రాష్ట్రేతరుడిగా కూడా జగన్ ను అన్నారు. ఆంధ్ర నిర్ణయాలు హైదరాబాద్ లో తీసుకుంటే ఎలా? అని అనేక సార్లు చంద్రబాబు ప్రశ్నించారు కూడా. కట్ చేస్తే చంద్రబాబుకు ఇప్పుడు అదే పరిస్థితి ఎదురవుతుంది. అయితే చంద్రబాబు కరోనా కారణంగానే హైదరాబాద్ కు పరిమితమయ్యారు. అప్పుడప్పుడు అమరావతి వచ్చి వెళుతున్నారు.నిజానికి కరోనా లేకుంటే చంద్రబాబు నిత్యం జనాల్లో ఉండేందుకే ప్రయత్నించేవారు. అది ఆయనకు అత్యంత ఇష్టం కూడా. ఇసుక వంటి సమస్యలపై కూడా ఆయన దీక్షలు చేశారు. వయసు రీత్యా ఆయన బయటకు రాకూడదని భావించి హైదరాబాద్ కే పరిమితమయ్యారు. కానీ ఆంధ్రప్రదేశ్ లో జరిగిన మున్సిపల్ ఎన్నికలు, తిరుపతి ఉప ఎన్నికల్లో మాత్రం ఆయన బయటకు వచ్చారు. కరోనా ఉన్నప్పటికీ రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఇది విమర్శలకు తావిస్తుంది.ఇప్పుడు కరోనా సమయంలో జూమ్ యాప్ లో ప్రభుత్వం పై విమర్శలు చేయడంపై సోషల్ మీడియాలో ప్రతికూల కామెంట్స్ వినపడుతున్నాయి. వయసు రీత్యా చంద్రబాబు బయటకు రాకపోవడమే మంచిది కాని, రాజకీయాలు చేయడానికి, ఎన్నికలప్పుడు ఆయనకు కరోనా గుర్తుకు రాదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలోనే అయ్యన్న పాత్రుడు వంటి సీనియర్ నేతలు హైదరాబాద్ కే పరిమితమయితే పార్టీ బలోపేతం కావడం కష్టమేనని చేసిన వీడియోను ట్యాగ్ చేస్తున్నారు. మొత్తం మీద చంద్రబాబు బయటకు రాకపోవడం తప్పుపట్టడం లేదు కాని, ఎన్నికలు వచ్చినప్పుడు రావడాన్ని అవకాశవాదంగా అంటున్నారు

# జూడాల ఆందోళన

తిరుపతి ఏపీలో జూనియర్ డాక్టర్లు ఆందోళనలు కొనసాగుతున్నాయి. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవే ర్చటం లేదంటున్న జూడాలు..తిరుపతి రుయా ఆసుపత్రిలో తొలుత నాన్ కొవిడ్, తర్వాత కొవిడ్ విధులను బహిష్కరించనున్నారు. కొవిడ్ ఇన్సెం టివ్లు, ఉపకార వేతనాల నుంచి కోతలు,రోగుల కుటుంబ సభ్యుల నుంచి జూడాలకు భద్రత తదితర విషయాల్లో ప్రభుత్వం దిగిరాని పక్షంలో ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే రెండు రోజుల కిందటే జూనియర్ డాక్టర్లు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఈరోజు సమ్మెను చేపట్టారు. తిరుపతిలో సమ్మెకు దిగిన జూడా లు ... కోవిడ్ నేపద్యంలో తమకు ఉపకార వేతనాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధి విధానాలను ఏపీలో కూడా కొనసాగించాలని ప్రధానంగా డిమాండ్ చేశారు.

**మున్సిపల్ పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి**

ఆదోని పట్టణంలో మహావీర్ కాలనీ నందు ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి బుధవారం మున్సిపల్ పార్కు ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమృత స్కీం కింద 52 లక్షల రూపాయలతో కొత్త మున్సిపల్ ఈ పార్కును ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు ప్రజలందరూ పార్కును ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. గతంలో మేము మాట ఇచ్చిన ప్రకారం ఈ కాలనీలో పార్కు ఏర్పాటు చేయడం జరిగింది. పట్టణ కాలనీలలో కూడా అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇంకా ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే అది తక్షణం పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మీకు ఇచ్చిన మాట ప్రకారం ఆదోనిలో బైపాస్ రోడ్డు మెడికల్ కాలేజ్ రోడ్లు ఎంకరేజ్మెంట్ రోడ్లు విస్తరణ ఇవన్నీ కూడా త్వరలో పనులు జరుగుతాయని సీఎం అన్నారని ఎమ్మెల్యే చెపారు. ప్రస్తుతం అందరు కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండి ఈ కరోనా బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జయ మనోజ్ రెడ్డి వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా మున్సిపల్ చైర్మన్ శాంతమ్మ సీఐ చంద్రశేఖర్ చంద్రకాంత్రెడ్డి కౌన్సిలర్ సందీప్ రెడ్డి ఎస్సై రమేష్ లక్ష్మి కాంత్ రెడ్డిసన్నీ మామత్తు స్వామి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రిలో కార్పొరేషన్ వేడి

రాజమండ్రి, జూన్ 9, (న్యూస్ పల్స్)రోనా మహమ్మారి ఒక పక్క వణికిస్తోంది. మరోపక్క మండే ఎండలు. ఈ రెండింటి తోడు రాజమండ్రిలో ఇప్పుడు ఒక్కసారిగా పొలిటికల్ హీట్ బాగా పెరిగింది. ప్రతిష్టాకరమైన రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికలు కోర్ట్ వ్యవహారాల కారణంగానుు, గ్రామాల విలీనం కారణంగా మొన్నటి స్థానిక ఎన్నికలతో పూర్తికాలేదు. ఇప్పుడు విలీనం సమస్యలు తీరిపోయాయి. అయితే ఫైనల్ గా కోర్ట్ తీర్పు ఈ అంశంపై వెలువడాలిసి ఉంది. అయితే సర్కార్ ఇచ్చిన ఆర్డినెన్స్ తో 21 గ్రామాలకు బదులు 10 గ్రామాలను విలీనం చేసి ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు గత రెండు నెలలుగా వేగంగా సాగిస్తుంది. తాజాగా డివిజన్ల వారీ రిజర్వేషన్ లను సైతం ఖరారు చేసి 52 డివిజన్లలో ఒక్కసారి వేడి పుట్టించింది కార్పొరేషన్.మొదటి వేవ్ నుంచి రెండోవేవ్ వరకు రాజమండ్రిలో సేవా కార్యక్రమాల్లో రాజకీయ పార్టీలు పోటాపోటీగా చేస్తున్నాయి. వీటిలో అధికారపార్టీలో అన్ని గ్రూప్ లు పైచేయిగానే ఉన్నాయి. ఒకరకంగా చెప్పాలంటే ప్రధానపక్షం తెలుగుదేశం కన్నా వైసిపి లోని గ్రూప్ లు నడుమే ప్రజా సేవలో పోటీ సాగుతుంది. వైసిపి లోని ఎంపి మార్గాని భరత్ రామ్, సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆకుల సత్యనారాయణ, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆయన సోదరుడు జక్కంపూడి గణేష్ లు సేవాకార్యక్రమాలతో ప్రజల్లోకి చొచ్చుకుపోయే ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను నిత్యం తన లైవ్ లతో జనంలోకి తీసుకువెళుతు వారికి అందుబాటులో ఉంటూ భరత్ సాగిపోతున్నారు. ఇక డాక్టర్ ఆకుల సత్యనారాయణ తన సొంత డబ్బుతో అంత్యక్రియలకు ఉచిత వాహనాలను ఏర్పాటు చేశారు. రూపాయి ఖర్చు లేకుండా పేదల అంత్యక్రియలకు ఆయన కృషి చేస్తున్నారు. అదేవిధంగా నిత్యం వందలాదిమంది వైద్యులు, రోగులు వారిబంధువులకు అన్నదాన యజ్ఞం చేస్తున్నారు. తనవద్దకు విద్యా వైద్యం కోసం వచ్చేవారికి ఖర్చుకు వెనకాడకుండా ఆదుకుంటున్నారు డాక్టర్. మరోపక్క ఇదే రీతిలో జక్కంపూడి రాజా తన తండ్రి మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన రావు ఫౌండేషన్ ద్వారా ఉచిత అంత్యక్రియల వాహనాలు, ఆసుపత్రుల్లో బెడ్ లను సమకూర్చిపెట్టడం వంటి చర్యలతో ముందుకు సాగుతున్నారు. అలాగే రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సైతం కరోనా సోకిన వారికి మందుల కిట్ లను అందిస్తూ సేవ చేస్తున్నారు.తెలుగుదేశం అర్బన్ బాధ్యతలు ఇప్పుడు ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని భర్త ఆదిరెడ్డి వాసు మోస్తున్నారు. ఆయన వైసిపి గ్రూప్ లకు ధీటుగా సేవలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నా ఒక్కరే అయిపోయారు. ఆక్సిజన్ సిలిండర్లు వంటివి ఏర్పాటు చేస్తూ సేవ చేసే స్వచ్ఛంద సంస్థలకు సహకారాన్ని అందిస్తూ ప్రజల్లో ఉండే ప్రయత్నం ఎంతోకొంత చేస్తూనే ఉన్నారు. ఆయనకు భార్య భవాని, తన తండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు లు సహకారం మాత్రమే అందుతుంది. మరోపక్క టిడిపి సీనియర్ నేత మాజీ మంత్రి గోరంట్ల బుచ్చయ్య చౌదరి రాజమండ్రి రూరల్ నియోజకవర్గానికే ఎక్కువ పరిమితం అయ్యారు. అర్బన్ వ్యవహారాల్లో ఆయన పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. దీనికి తోడు ఆయన వర్గంగా గట్టిగా ముద్ర పడిన మాజీ కార్పొరేటర్లు కురగంటి సతీష్, పాలిక శ్రీనివాస్, బెజవాడ రాజ్ కుమార్ వంటి వారంతా ప్రధాన అనుచరగణం గోడ దూకేశారు. ఇలాంటి స్థితిలో అర్బన్ లో గోరంట్ల వాయిస్ గట్టిగా వినిపించే వారు దాదాపు లేకుండా పోయారు. ఈ నేపథ్యంలో అర్బన్ టిడిపి రాజకీయం మొత్తం ఆదిరెడ్డి చుట్టూనే తిరుగుతూ వుంది.త్వరలో రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికలు జరగనుండటంతోనే అన్ని పార్టీలు సేవల్లో పోటీగా నడుస్తున్నట్లు జనం భావిస్తున్నారు. ఆందోళనకర రీతిలో పెద్ద సంఖ్యలో కేసులు నమోదు అవుతున్నా కార్పొరేటర్ టికెట్ల కోసం తమ టికెట్ పైకి పోతుందన్న భయాన్ని సైతం పక్కన పెట్టి నేతలు దూసుకు పోతున్నారు. ఎపి లో టిడిపి ఇటీవల జరిగిన అన్ని ఎన్నికల్లో బలహీనపడిన నేపథ్యంలో జగన్ ఏ సమయంలో అయినా రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికలకు గంట కొట్టిస్తారనే ఆలోచన విపక్ష పార్టీలు బలంగా నమ్ముతున్నాయి. చిన్నపాటి కోర్ట్ అడ్డంకి తొలగిపోవడం కరోనా కేసుల సంఖ్య బాగా తగ్గుముఖం పడితే రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికల వార్ కి గ్రీన్ సిగ్నల్ వచ్చేందుకే రంగం సిద్ధమై ఉంది. ఇక్కడి కార్పొరేషన్ ఏర్పడిన నాటినుంచి ఇప్పటికి మూడు సార్లు టిడిపి మేయర్ స్థానాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో ఆ రికార్డ్ ను తిరగరాయడానికి వైసిపి నేతలు కట్టుకున్న కంకణం, కంటున్న కలలు ఏ మేరకు ఫలిస్తాయో త్వరలో తేలనుంది.

## సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని ప్రతిష్టాత్మకంగా అమలుచేయడంతో పాటు పేద మధ్యతరగతి కుటుంబాలకు ,వైద్య ఖర్చుల నిమిత్తం వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఎన్నడూ లేని విధంగా ఉదారంగా ఆర్థిక సహాయం అందచేస్తున్నారు అని ఆయన సేవలను కొనియాడారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా అనేక వ్యాధులకు వైద్యం అందించడంతో పాటు, ప్రత్యేకంగా వైద్యం అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గోనెగండ్లలో ఆనందయ్య మందు తయారి

**- డాక్టర్.యస్ ఏ యస్ ఖాద్రి**

**యునాని వైద్యులకు మెగాఫ్యాన్స్ ఘనసన్మానం**

గోనెగండ్ల, ఆయుష్ శాఖ, ప్రభుత్వ యునాని వైద్యశాల, యునాని వైద్య అధికారి డాక్టర్.ఖాద్రి ఆనందయ్య మందు తయారికి ఎంపిక కావడంతో ఎమ్మిగనూరు మెగాఫ్యాన్స్ సేవా సమితి తాలూకా అధ్యక్షులు రాహుల్ సాగర్, గోనెగండ్ల మండల అధ్యక్షులు మాలిక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు, ఈ సంధర్భంగా డాక్టర్ ఖాద్రి మాట్లాడుతూ రాయలసీ మజోన్ పరిధి నుంచి గతవారం రోజుల క్రితం విజయవాడలో జరిగిన డేమోకు హాజరై మందు తయారీ గురించి తెలుసుకొని స్వతహాగా తయారు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల12వ తేదీ కర్నూలులో జరుగు రాయలసీమ జిల్లాల నుంచి డేమోలో పాల్గొనే కడప, కర్నూలు, అనంతపురం, జిల్లాలకు చెందిన ఆయుర్వేద/యునాని వైద్యులకు డాక్టర్ ఖాద్రి డెమో ఇస్తున్నట్లు తెలిపారు. కొన్ని మూలికలు దొరికిన కొన్ని కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాతలు ముందుకు వచ్చి కొన్ని వస్తు సామగ్రిలు అందిస్తే ప్రజలకు ఆనందయ్య మందు తయారు చేసి ఉచితంగా అందిస్తామని తెలిపారు, మెగాఫ్యాన్స్ సేవా సమితి తాలూకా అధ్యక్షులు, రాహుల్ సాగర్, మాట్లాడుతూ, ఆనందయ్య మందు తయారికి రాయలసీమజోన్ లో కర్నూలు జిల్లాలోనే గోనెగండ్ల ఎంపిక కావడం మండల ప్రజల అదృష్టం అన్నారు, డాక్టర్ ఖాద్రి, గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు జాగ్రత్తలు పలు సూచనలు ఇస్తూ, కరోనా వ్యాధి పై గ్రామవిధుల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిలో ఉన్న భయాలను దూరం చేస్తూ ప్రజల మన్ననలు పొందారని గుర్తుచేశారు. కరోనా బాధితులకు ఉపశమనం కలిగించే ఆనందయ్య మందు గోనెగండ్లలో తయారు చేయడం గ్రామ ప్రజల అదృష్టం అన్నారు. మందుల తయారి సామాగ్రి అందించే దాతలు ముందుకు రావాలని కోరారు, ఈ కార్యక్రమంలో మెగాఫ్యాన్స్ సేవాసమితి సభ్యులు ఖాసీం సాహెబ్, చాంద్ బాషా, పులికొండ, పాల్గొన్నారు.

## సత్తుపల్లి ప్రజల చిరకాల కోరిక తీర్చిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కి ధన్యవాదాలు

**సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య**


సత్తుపల్లి హైదరాబాదులో సమావేశమైన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో సత్తుపల్లిలో సకల సౌకర్యాలతో ,100 బెడ్ లతో ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాన్ని మంజూరు చేసిన గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు కి సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం నిర్మితమై ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి 1978 వ సంవత్సరంలో మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మించారని ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనాన్ని మంజూరు చేయాలని పూర్వం ముఖ్యమంత్రి కెసిఆర్ ని కలిసి కోరగా, సత్తుపల్లి ప్రజల చిరకాల వాంఛ 100 బెడ్ ల నూతన భవనాన్ని మంజూరు చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రిని మాతా శిశు సంరక్షణ కేంద్రంగా వినియోగించుకోవాలని సూచించినట్లుగా తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజల కోసం సత్తుపల్లి వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రిని అభివృద్ధి పథంలో నిలిపామని సకల సౌకర్యాలను ఏర్పాటు చేశామని అత్యాధునిక సౌకర్యాలతో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేసి సేవలు అందించడం జరిగిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. కరోనా రోగులకు వైద్యం అందించడంలో భాగంగా సత్తుపల్లి, పెనుబల్లి మండల కేంద్రాల్లో నియోజకవర్గ ప్రజల కోసం 100 పడకలతో ఆక్సిజన్ ఐసోలేషన్ వార్డులు ఏర్పాటుచేసి మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నామని, ఆసుపత్రి నందు రెమిడి సివర్ ఇంజక్షన్, మందుల కొరత లేకుండా వైద్య సౌకర్యాలు సహాయ సహకారాలను అందించామని, కరోనా రోగులకు రెండు పుట్ల పౌష్టికాహారాన్ని అందించామని నియోజకవర్గంలో గ్రామగ్రామాన ఇసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధుల సహకారంతో వారికి భోజన సౌకర్యాలు ఏర్పాటు చేసి సహకారాన్ని అందించామన్నారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ప్రతి రోజూ 100 మినరల్ వాటర్ బాటిల్ ను అందించామని, కరోనా తీవ్రత తగ్గే వరకు కూడా ఆసుపత్రిలో రోగులకు ఆక్సిజన్ అందించేందుకు సింగరేణి సి.ఎం.డి తో మాట్లాడి ఆక్సిజన్ కొరత లేకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. కరోనా తీవ్రత దృష్ట్యా నియోజకవర్గంలో రోజుకు 3500 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వంతో మాట్లాడి ఆదేశాలు జారీ చేయించామన్నారు. కరోనా నియంత్రణకు చర్యల్లో భాగంగా ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో అధికారులను అప్రమత్తం చేసి కఠినమైన చర్యలుతో రాకపోకలు నిలిపివేసి, లాక్ డౌన్ నిబంధనలు, గ్రామా స్థాయి ఆశ వర్కర్లు వైద్యుల పర్యవేక్షణలతో 38 శాతం ఉన్న నమోదు రేటును 6.11 శాతానికి తగ్గించగలిగామన్నారు. నియంత్రణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జ్వర సర్వే సత్ఫలితాన్ని ఇచ్చిందని లక్షణాలు అనుమానం ఉన్న వారికి 6500 మెడికల్ కిట్లు ఇచ్చి కరోనాని అదుపులోకి తీసుకువచ్చామని తెలిపారు.

## వేదంతాన్ని ఒంటపట్టించుకుంటున్న ధర్మాన



శ్రీకాకుళం, జూన్ 9, (న్యూస్ పల్స్)కాకుళం జిల్లాకు చెందిన మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు పుట్టిన రోజు ఈసారి కూడా ఆన్ లైన్ లోనే సాగింది. నిజానికి కరోనా వేళ ఆర్భాటంగా జరుపుకునే పరిస్థితులు అయితే లేవు. గత ఏడాది మొదటి దశ కరోనాతో ఎవరూ తనను కలవవద్దంటూ ధర్మాన విన్నవించుకున్నారు. ఈసారి కూడా సెకండ్ వేవ్ తో ధర్మన ఇంట్లోంచి అసలు బయటకు రాలేదు. అయితే మాత్రం అభిమానం ఊరుకుంటుందా. ఆన్ లైన్ లో ఆయన ఫోటోలు పెట్టి మరీ అనుచరులు విషెస్ చెప్పారు. ఇక మీడియాలో కూడా ధర్మాన ప్రసాదరావు ప్రకటనలతో హోరెత్తించారు. మొత్తానికి మాజీ మంత్రిని బాగా ఆనందమే కలిగించారు.ఇక ధర్మాన ప్రసాదరావుని అభిమానులు ఒక్క లెక్కన పొగిడారు. శ్రీకాకుళం జిల్లాకు నీటి ప్రాజెక్టులు తెప్పించిన అపర భగీరధుడు అన్నారు. చాణక్యుడు అని కితాబు ఇచ్చారు. సమర్ధ నేత, మంత్రిగా మచ్చలేని నాయకుడు అని కూడా కీర్తించారు. ఆయన ఒక్కడు చాలు సిక్కోలుకు ఆణిముత్యం అంటూ కవితలూ వల్లె వేశారు. నిజానికి ప్రసాదరావుకు ఇప్పటికీ అనుచర గణమే బలం. ఆయన దాదాపుగా ఎనిమిదేళ్ళుగా ఏ పదవీ లేకుండా ఉన్నా కూడా అనుచరులు మాత్రం అదే రకమైన ప్రేమను చూపించడం విశేషమే.ఇప్పటిదాకా రాజకీయ సమీకరణలు మారుతాయని, ఏదో రోజున తమ నేతకు మంత్రి పదవి వస్తుంది అని అనుచరులలో ధీమా ఉండేది. అందుకే రాబోయే కాలానికి కాబోయే మంత్రి అంటూ అప్పట్లో ప్రకటనలు వచ్చేవి. కానీ ఇపుడు మాత్రం అలాంటివేవీ లేవు. భవిష్యత్తుని పక్కన పెట్టి ఆయన గతంలో సాధించిన విజయాలు, అలంకరించిన పదవులే పెద్ద జాబితాను తయారు చేసి ప్రకటనలు ఇచ్చేశారు. ఆయన లాంటి నిజాయతీపరుడు మరొకరు ఉండరు అంటూ కూడా అనుచరులు వీరాభిమానమే ఉప్పొంగించారు. దీన్ని బట్టి చూస్తే ధర్మాన ప్రసాదరావుకు మంత్రి పదవి అందని పండు అన్న సంగతి క్యాడర్ కి కూడా అర్థమైంది అంటున్నారు.ధర్మాన ప్రసాదరావుకూడా ఒకింత వేదాంతాన్ని వంటబట్టించుకున్నారట. ఇక తన క్రియాశీల రాజకీయ జీవితానికి స్వస్తి అంటున్నట్లుగా చెబుతున్నారు. తన వారసుడిగా రామ్మోహననాయుడుని జనం ముందు పెట్టారు. ఆయనకు ఉన్న ఆశ ఒక్కటే. తన శ్రీకాకుళం ఎమ్మెల్యే సీటుని కుమారుడిని జగన్ తప్పకుండా ఇస్తారని, ఆ విధంగా 2024 నాటికి కొడుకుని ఎమ్మెల్యేగా చూసుకుని రాజకీయ జీవితానికి ఫుల్ స్టాప్ పెడదామని ఉందిట. అందుకే ఆయన అసంతృప్తి వంటి వాటిని దాటి ఇపుడు స్థిమితంగా ఉంటున్నారు అని చెబుతున్నారు. జగన్ కచ్చితంగా సీనియర్లను, వయసు మీరిన వారిని పదవులలో తీసుకోరు. దాంతో యువ రక్తంగా ఉన్న కుమారుడిని ముందు పెట్టి తాను తప్పుకోవాలని ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. మొత్తానికి ప్రతీ పుట్టిన రోజుకూ ఎవరికైనా వయసు పెరుగుతుంది. దాంతో పాటు ధర్మాన ప్రసాదరావుకు మరింతగా మేధస్సు కూడా పెరిగి తానేంటి అన్నది బాగా అర్థమవుతోంది అంటున్నారు

## నట్టేట మునుగుతున్న రైతులు



విజయవాడ, జూన్ 9, (న్యూస్ పల్స్) రబీ పంటలు అమ్ముకుంటున్న రైతులు మౌనంగా రోదిస్తున్నారు. మద్దతు ధరకే ధాన్యాన్ని అమ్ముకోండి, నష్టానికి అమ్ముకోవద్దని ఉన్నతాధికారులు బాహాటంగా ప్రకటనలు ఇస్తున్నా, ధాన్యం కొనుగోలు కేంద్రాలు (పిపిసి) వద్ద జరుగుతున్న తంతు ప్రకటనలకు భిన్నంగా జరుగుతోంది. చూస్తూ చూస్తూ తమ రెక్కల కష్టాన్ని మిల్లర్లకు ఉచితంగా ధారబోయాల్సిన పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ గణాంకాల ప్రకారం 21.75 లక్షల హెక్టార్లలో రబీ ధాన్యం సాగైంది. దీని నుంచి సుమారుగా 41 లక్షల మెట్రిక్ టన్నుల పైబడి ధాన్యం దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. అయితే రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా రైతుల నుండి ధాన్యం సేకరించే పనిని నిర్వహిస్తోంది. ధాన్యం సేకరణ అద్భుతంగా జరుగుతుంది, రైతులు ఆనంద పరమానందభరితులై గంతులు వేస్తున్నారని అధికారులు, ఇతర పత్రికలు ప్రభుత్వ డోలు వాయిస్తున్నా జరుగుతున్న అసలు తంతు ఇదే..రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రాష్ట్ర ప్రభుత్వం సరిపడినన్ని గోనె సంచులు సిద్ధం చేసి ఉంచాలి. అయితే ధాన్యం అమ్ముకునేందుకు పిపిసికి వెళ్లిన రైతుకు నిరాశే ఎదురవుతుంది. ఓ పక్క కల్లాల్లో ధాన్యం రాశులు, ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో వర్షాల భయం, మరోపక్క దొంగల భయంతో రైతులు ధాన్యానికి కాపలా కాయలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీన్ని అదనుగా భావించిన పిపిసి అధికారులు రైతుల దృష్టిని మిల్లర్లవైపు మళ్లిస్తున్నారు. గోనె సంచులు ఇవ్వాలంటే క్వింటాకు 10 కేజీలు తగ్గించుకోవాలనే షరతు రైతులకు విధిస్తున్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో క్వింటాకు 10 కేజీలు చొప్పున నష్టపోయి సంచులు తెచ్చుకుని ధాన్యం అమ్ముకోవాల్సి వస్తున్న విషయాన్ని రైతులు బయటకు చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి.రైతుతో మిల్లర్లు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రైతు కళ్లం వద్దకే లారీ వెళ్లడం, ధాన్యాన్ని మిల్లుకు తీసుకెళ్లడం జరుగుతోంది. వాస్తవంగా రైతు ధాన్యాన్ని గ్రామ వ్యవసాయ సహాయకులు, పిపిసి అధికారులు దగ్గరుండి తూకం వేయించి, మిల్లుకు లోడు పంపాలి. కానీ ఇదేదీ ప్రస్తుతం జరగడం లేదు. ఉదాహరణకు రైతు నుంచి 100 క్వింటాళ్లు ధాన్యాన్ని మిల్లరు కొనుక్కెళితే కేవలం 90 క్వింటాళ్లే పిపిసి తనకు పంపిందని, ఆ ధాన్యం తాను తీసుకున్నానని మిల్లర్లు ఇచ్చే తప్పుడు రికార్డులు పిపిసి అధికారుల ద్వారా వెబ్‌సైట్‌లో అత్యధికంగా నమోదవుతున్నాయి. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర అందుతుందని, కొనుగోళ్లు వేగవంతంగా జరుగుతున్నాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. కానీ రైతు 10 క్వింటాళ్లు ధాన్యంపై వచ్చే ఆదాయాన్ని కోల్పోతున్నాడని ఏ అధికారికీ కనబడడం లేదు.రైతుల కష్టార్జితాన్ని దోచుకునేందుకు పిపిసి అధికారులు, మిల్లర్లు ఉన్నతాధికారుల కళ్లుకప్పి హైటెక్ మోసాలకు పాల్పడుతున్నారు. మిల్లర్లు, పిపిసి అధికారులు ముందస్తు ఒప్పందాలతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రైతుల వద్ద తూకం తగ్గించి కొనుగోలు చేస్తున్న ధాన్యం వివరాలు రికార్డుల్లో నమోదు చేసేందుకు పిపిసి అధికారులు బేరం కుదుర్చుకుంటున్నారు. మిల్లర్లు ఇచ్చిన పత్రాలతో రైతు పిపిసి ద్వారా మద్దతు ధరకే ధాన్యం అమ్ముకున్నట్లు పిపిసి అధికారి వెబ్‌సైట్‌లో రికార్డులు నమోదు చేస్తున్నారు. దీంతో రైతు మద్దతు ధరకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నాడని లోకానికి కనబడుతుంది. కానీ మిల్లరు 100 క్వింటాలు ధాన్యం తీసుకెళ్లి 90 క్వింటాళ్లే తనకు అందిందని ఇచ్చే దోపిడీ పత్రాలు ఎవరికీ కనబడడం లేదు. ఫలితంగా ప్రభుత్వానికి ఖర్చు తప్పడం లేదు, రైతుకు నష్టం తప్పడం లేదు. అంతిమంగా పిపిసి అధికారులు, మిల్లర్లు మాత్రం రైతులను అడ్డగోలుగా దోచుకుంటున్నారు. కానీ ఇవేవీ రైతు బయటకు చెప్పుకోలేక మౌనంగా తనలో తానే కుమిలిపోతున్నాడు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా పౌరసరఫరాల సంస్థ 2,14,671 మంది రైతుల నుంచి రూ.4,605.69 కోట్లు విలువ గల 24,60,158.720 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. వీటి తాలూకా చెల్లింపులు, బకాయిల వివరాలు చెప్పేందుకు పౌరసరఫరాల సంస్థ ఎమ్‌డి ఎ.సూర్యకుమారి అందుబాటులో ఉండడం లేదు.

## నిత్యం గ్రామ యోగక్షేమాలు

**ఐసోలేషన్ కిట్స్ అందజేస్తున్న సర్పంచ్ పోట్లపాటి ప్రవీణ**

పత్తికొండ నిత్యం గ్రామ యోగ క్షేమాలు కై పాటుపడుతున్న దేవనబండ సర్పంచ్ ప్రవీణ విలేకరులతో మాట్లాడుతూ తన ధ్యేయం గ్రామ అభివృద్ధి కోసం తన వంతు సహకారాన్ని అందించడంలో ఏ మాత్రం వెనుకడుగు వేయను అని చెప్పారు. ప్రస్తుతం ఉన్న కరోనా నేపథ్యంలో చాలా దూరం ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తున్నందున కార్యదర్శి పవన్ తో మాట్లాడి గ్రామంలో ఐసోలేషన్ ఏర్పాటు చేస్తూ కరోనా పాసిటివ్ నిర్ధారణ వచ్చిన వారికి ప్రవీణా చేతుల మీదుగా ఐసోలేషన్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రుద్రమ్మ , రాజేశ్వర మరియు ఆశా కార్యకర్తలు, వాలంటీర్ రామకృష్ణ పాల్గొన్నారు. గర్భిణీలకు,బాలింతలకు పౌష్టికాహార లోపం లేకుండా చూడాలి..

## నెట్టెంపాడు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

జోగులాంబ గద్వాల : జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడం ప్రభుత్వ లక్ష్యమని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. బుధవారం ధరూర్ మండలంలోని జూరాల బ్యాక్ వాటర్ నుంచి నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి నీళ్లు వస్తుండగా నెట్టెంపాడు ప్రాజెక్టు ఫేస్ వన్ నుంచి ఎమ్మెల్యే మోటర్ ఆన్ చేసి గుడ్డం దొడ్డి ర్యాలంపాడు రిజర్వాయర్లకు నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఏడాది కంటే నెల రోజుల ముందుగానే పంపు ఆన్ చేయడం సంతోషం



సంతోషంగా ఉందన్నారు. ఎగువన వర్షాలు కురవడంతో జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరదలను దృష్టిలో ఉంచుకొని నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా నీటిని గుడ్డం దొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్లను నింపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీజేపీ ఎస్ఈ శ్రీనివాస రావు, ఈఈ రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సచివాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీదేవమ్మ

పత్తికొండ పత్తికొండలో గెస్ట్ హౌస్ సమీపంలో గల 6వ గ్రామ వార్డు సచివాలయన్ని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు సచివలయాల నిర్మాణాలు చాలా వేగవంతం గా నిర్మిచాలన్నారు. మిగతా గ్రామ వార్డు సచివాలయాలు మరింత వేగవంతంగా నిర్మించి ప్రతి ఒక్కరికి కుల,మత బేధాలు లేకుండా అన్ని సంక్షేమ సదుపాయాలు కల్పించి మన జగనన్న కు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషయ్య , ఎంపిడిఓ పార్థసారథి, పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణకుమార్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ దీపిక, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ , జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, ఉప్పర సంఘం రాష్ట్ర డైరెక్టర్ బజారప్ప, మాజీ సర్పంచ్ సోమశేఖర్, ఎంపీటీసీ సభ్యులు గణపతి, వైఎస్ఆర్ పార్టీ నాయకులు శ్రీనివాస రెడ్డి, పల్లె ప్రతాప్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు నారాయణ దాస్, షాదీఖానా కమిటీ చైర్మన్ హనీఫ్, కోటి, డాక్టర్ నీలకంఠ, నజీర్, ఇమ్రాన్, షరీఫ్ మరియు డాక్టర్ మురళీ మోహన్ రెడ్డి, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పత్తికొండ మండలం లోని ప్రభుత్వ ఆసుపత్రి నీ ఎమ్మెల్యే శ్రేదేవమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్పటల్ ప్రాంగణంలో స్కానింగ్ వైద్య నిమిత్తం వచ్చిన గర్భిణీల తో ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఎప్పటికప్పుడు స్కానింగ్ పరీక్షలు చేయించుకోవాలని గర్భిణీ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సమయానికి ఇచ్చిన మందులు ప్రతి రోజు వాడుతూ వైద్య పరీక్షలు చేయించుకోవలన్నారు. వైద్య కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే.. డాక్టర్ కల్పన తో మాట్లాడుతూ పేషెంట్లకు సరైన సౌకర్యాలు కల్పించాలని ఎక్కువ సేపు గర్భిణులను నిలబెట్టకుండా వీలైనంత తొందరగా స్కానింగ్ చేసి వారిని పంపించాలని తెలియజేశారు.

## నిత్య సేవకులకు నీరాజనం

**అప్పన్న బోయిలకు నూతన వస్త్రాలు , నగదు**

**ఆలయంలో అందజేసిన అప్పన్న ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు గంట్ల శ్రీనుబాబు**

సింహాచలం , జూన్ 9 అప్పన్న దేవస్థానంలో బోయిల పాత్ర అత్యంత కీలకం ., సిరులొలికించే సింహాద్రినాధుడిని నిరంతరం తమ భుజస్కందాలపై మోసే అదృష్టం దక్కించుకున్న బోయిలు నిరంతర సేవకులే ,,. కొండ దిగువున పాత అడవివరం , విజినీగిరిపాలెంకు చెందిన 20 మంది బోయిలు నిరంతరం సింహాద్రినాధుడి సేవలో తరిస్తారు ., అయితే వీరు శాశ్వత ఉద్యోగులు కాదు , అలాగని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అంత కంటే కాదు . కాని ఆలయంలో విశేష ఉత్సవాలు జరిగినప్పుడు , కొండ దిగువుకు స్వామిని తీసుకువచ్చే సమయంలో వీరే కీలకం . మకరవేట ( గజేంద్రమోక్షం ) , తెప్పోత్సవం , జమ్మివేట , బొట్టినడిగే పున్నమితో పాటు అనేక సందర్భాల్లో స్వామిని ,అమ్మవార్లను మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు వీరే తీసుకువస్తారు ఇక గ్రామ తిరువీధిలోని వీరి సేవలు ప్రశంసనీయం . అయితే ఉత్సవాలను బట్టి మాత్రమే వీరు ఆలయ వర్గాలు పిలుపు మేరకు హాజరుకావడం జరుగుతుంది స్వామి, అమ్మవార్ల సేవలో వీరి సేవలు అత్యంత ప్రశంసనీయంఈ నేపథ్యంలోనే వీరి సేవలను గుర్తించాలని భావించి తన వంతు గా అప్పన్న ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు , జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి , వైజాగ్ జర్నలిస్టు ల ఫోరమ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు బుధవారం అప్పన్న ఆలయంలో వీరికి పంచ , కండువా , షర్టుతో కూడిన నూతన వస్త్రాలను కొంత నగదునుఅందజేసి సత్కరించారు... ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ అప్పన్న ఉత్సవాల్లో బోయిలు సేవలు అత్యంత ప్రశంసనీయమని ,. స్వామివారి సేవలో పాల్గొనడం వీరి అదృష్టమని అభివర్ణించారువేతనంకోసంకాకుండాస్వామి వారికి సేవలందించాలని భావించే వారు తరచూ హాజరుకావడం జరుగుతు oదని ఇది అభినందనీయమన్నారు . సింహాచలం గ్రామస్తుడుగా వారి సేవలు తాను గుర్తించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు..భవిష్యత్తులో వారికి దేవస్థానం తాత్కాలిక గుర్తింపు కార్డులు ఇచ్చి , సముచిత స్థానం కల్పించాలని ట్రస్టుబోర్డు సమావేశంలో కోరనున్నట్లు శ్రీనుబాబు చెప్పారు . అనంతరం సింహాద్రి నాధుడు నిత్యకళ్యాణంలోపాల్గొని స్వామి.అమ్మవార్ల ను సేవించి తరించారు...

# చిరంజీవి.. జగన్ మధ్య దూరం పెరిగిందా



హైదరాబాద్, జూన్ 9, c(న్యూస్ పల్స్)టాలీవుడ్ పెద్దగా ఉంటున్న మెగా స్టార్ చిరంజీవి జగన్ విషయంలో గత రెండేళ్ళుగా సానుకూలంగానే ఉంటూ వస్తున్నారు. జగన్ సీఎం అయ్యాక తాడేపల్లిలోని ఆయన నివాసానికి వచ్చి మరీ అభినందనలు తెలిపారు. ఆ తరువాత సినీ రంగం ఎదుర్కొంటున్న సమస్యల మీద సినీ ప్రముఖులందందరితోనూ కలసి వచ్చి జగన్ తో చర్చలు జరిపారు. ఈ మధ్యలో జగన్ మూడు రాజధానుల ప్రతిపాదనతో పాటు, కర్నూలు లో విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టడాన్ని కూడా చిరంజీవి స్వాగతించి జగన్ ని ఖుషీ చేశారు. తెలుగు సినిమా రంగంలో రాజకీయాలు ఎలా ఉన్నా చిరంజీవి మాత్రం జగన్ విషయంలో సపోర్ట్ గానే ఉంటున్నారు.ఇక కరోనా వేళ ఏపీతో పాటు తెలంగాణాలో చిరంజీవి ప్రతీ జిల్లాలో ఆక్సిజన్ బ్యాంకులను ఏర్పాటు చేశారు. దానికి తన సొంత నిధులను వెచ్చిస్తున్నారు. అయితే తాను చేస్తున్న సేవలకు అనుకున్నంతగా ప్రచారం రాకపోవడంతో చిరంజీవి బాధపడ్డారని తాజాగా ఒక తెలుగు పత్రికాధిపతితో ఆయన జరిపిన ఫోన్ సంభాషణ తెలియచేస్తోంది. ఇది లీక్ కావడం వెనక ఎవరు ఉన్నారన్నది పక్కన పెడితే మెగాస్టార్ మాత్రం రాజకీయ నాయకుల తీరుని తప్పుపట్టిన విధానం మాత్రం ఆయనలో దాగున్న ఆక్రోశాన్ని వెల్లడించింది.మరో వైపు చూస్తే తెలంగాణాలో కొందరు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు చిరంజీవి ఆక్సిజన్ బ్యాంకుల ద్వారా చేస్తున్న సేవలను కొనియాడారు. అదే సమయంలో ఏపీలో మాత్రం స్పందన నిల్ గా ఉంది. దీంతో ఎందుకిలా అన్నదే చర్చగా ఉంది. చిరంజీవికి జగన్ కి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. పైగా ఆయన తన తమ్ముడు జనసేన పార్టీ పెట్టి జగన్ మీద పోరాడుతున్నా కూడా తాను మాత్రం మంచి పని చేసిన ప్రతీ సారి జగన్ ని మెచ్చుకుంటూ వస్తున్నారు. అలాంటిది ఏపీలో కరోనా రెండవ దశలో ఎవరు ఏ చిన్న సాయం చేసినా ప్రభుత్వం ప్రోత్సహించాల్సిందే. పైగా మెగాస్టార్ వంటి సినీ దిగ్గజం ముందుకు రావడాన్ని కచ్చితంగా అభినందించితీరాలి. కానీ వైసీపీ నుంచి అనుకున్న స్పందన ఎందుకు రావడం లేదు అన్నదే చర్చగా ఉందిట.చిరంజీవి రాజకీయాల్లో కూడా కొన్నాళ్ళు ఉన్నారు. ఆయన కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఇక ఆయన తమ్ముడు పవన్ ఎటూ జగన్ వైరి శిబిరంలో ఉన్నారు. మరో మూడేళ్ళలో జరిగే ఎన్నికల్లో జగన్ ని గద్దె దించడానికి పవన్ చేయాల్సినది అంతా చేస్తారని అందరికీ తెలుసు. ఇక చిరంజీవిలో కూడా రాజకీయ కాంక్షలు ఇంకా ఇంకిపోలేదని ప్రచారం కూడా సాగుతోంది. ఈసారి మెగా బ్రదర్స్ అంతా కలసి ఒక పట్టు పడతారని కూడా అంటున్నారు. బీజేపీతో పొత్తు ఎలాగూ ఉంటుంది. దాంతో సరైన సమయంలో మెగాస్టార్ కూడా రాజకీయ రంగంలోకి దిగుతారు అన్నది వినిపిస్తున్న మాట. బహుశా ఇలాంటివేవో వైసీపీ పెద్దల చెవి దాకా రావడంతోనే మెగాస్టార్ పొలిటికల్ రీ ఎంట్రీకి ఆక్సిజన్ అందివ్వరాదనే ఈ విధంగా సైలెంట్ అయ్యారని అంటున్నారు. ఇక్కడ మరో విషయమూ ఉందిట. సినీ పరిశ్రమను ఏపీలో అభివృద్ధి చేసేందుకు తాను ఎంత చొరవ తీసుకున్నా కూడా అటు నుంచి సహకారం లేదన్న బాధ కూడా జగన్ లో ఉందిట. పైగా సినీ పెద్దలు అంతా టీయారెస్ సర్కార్ కి బాహాటంగా మద్దతు ఇవ్వడం వంటివి కూడా మెగా దూరం పెరగడానికి కారణం అంటున్నారు. చూడాలి మరి భవిష్యత్తులో ఏం జరుగుతుందో.

# ప్రజలపై పన్నుల బాదుడు విరమించుకోవాలి

## రాజకీయ పార్టీలు డిమాండ్...

డోన్ ప్రజలపై పన్నుల బాదుడు విరమిచుకోవాలి అని అన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నారు, స్థానిక డోన్ సి పి ఐ కార్యాలయంలో బుధవారం ఈ సమావేశం నిర్వహించారు,కరోన విపత్కర పరిస్థితుల్లో ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నుల బాదుడుకు సిద్ధమవ్వడం చాలా దుర్మార్గపు చర్య స్థానిక సీపీఐ కార్యాలయంలో రాజకీయ పార్టీలు–ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంకు సీపీఐ పట్టణ కార్యదర్శి నక్కిశ్రీకాంత్ అధ్యక్షత వహించారు,అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. సుంకయ్య, కె. రాధాకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జనార్దన్, జనసేన పార్టీ నాయకులు మధు సీపీఐ జిల్లా సమితి సభ్యులు కె. నాగరాజు లు మాట్లాడుతూ కరోన మహమ్మారి ప్రజలను అతలాకుతలం చేస్తున్న ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వాము కరోన కట్టడి పట్ల నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరిస్తూ ఆస్తి పన్నులు పెంచుతూ పేదలపై మరో బాదుడుకు సిద్ధమవ్వడం సిగ్గు చేటు కలిగిస్తుందని వారన్నారు పట్టణ ప్రజలు పై ఆస్తి విలువ ఆధారంగా ఆస్తి పన్నులు పెంచడం, చెత్త పన్ను కేటగిరీలుగా పెంచడం, మంచి నీటి చార్జీలు, యూజర్ చార్జీలు పెంచేందుకు పావులు కదుపుతోంది. చేయడాని రాజకీయ పార్టీలు గా ఖండిస్తున్నాము అన్నారు కోవిడ్ లాక్ డౌన్,వల్ల ఉపాధి లేక ప్రజలు అల్లాడుతూ పన్నులు, వడ్డీలు రద్దు చేయమని అడుగుతుంటే ఉన్న పన్నులను మరింత పెంచడం దుర్మార్గం, ఏరు దాటాక తెప్ప తగాలేసినట్లు గా స్థానిక ఎన్నికలు పూర్తియ్యాక పట్టణ ప్రజలపై పన్నుల భారాలు మేపడం వైస్సార్ ప్రభుత్వ కప్పదాటు వైఖరికి నిదర్శనం, మునిసిపాలిటీ లలో రూ,60,స్పెషల్ మునిసిపాలిటీ లలో రూ.90,కార్పొరేషన్ లలో రూ.120చొప్పున ప్రతి కుటుంబానికి పెంచుతూ నోటీసులు జారీ చేయడం దారుణం, రాష్ట్రంలోదాదాపు 50 లక్షల కుటుంబాలపై ఏడాదికి రూ.750నుంచిరూ.1450వరకు పెరిగిన పన్నుల భారం పడుతుంది

# కరోనా మహమ్మారిని నివారించడంలో మాకు సహాయపడే కొన్ని చిట్కాలు ఇక్కడ ఉన్నాయి



ప్రతి సంవత్సరం జూన్ 7 న ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని(చినీతీశ్రీట ఈనీనీట రాజీటవబిఎ ఆజీఎ) ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ రోజు ప్రధాన లక్ష్యం ప్రపంచ ప్రజలలో ఆహార భద్రత గురించి అవగాహన కల్పించడం మరియు దాని ద్వారా ఆహారం వ్యాధుల వ్యాప్తిని తగ్గించడం దీని ప్రధాన ఉద్యేశం. ప్రతి సంవత్సరం 600 మిలియన్ల మంది ప్రజలు ఆహారం ద్వారా వచ్చే అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పది మందిలో ఒకరు పోషకాహార లోపం మరియు వ్యాధితో బాధపడుతున్నారు. అపరిశుభ్రమైన ఆహారం మానవుల శారీరక ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా, అపరిశుభ్రమైన ఆహారం తినడం వల్ల ప్రతి సంవత్సరం సుమారు 1,25,000 మంది మరణిస్తున్నారు. 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 40 శాతం చెడిపోయిన లేదా అపరిశుభ్రమైన ఆహారాల వల్ల ప్రభావితమవుతారు. చినీతీశ్రీట ఈనీనీట రాజీటవబిఎ ఆజీఎ 2021 సురక్షితంగా తినడం మన ప్రతి ఒక్కరి బాధ్యత. దాని కోసం మనమంతా కృషి చేయాలి. సురక్షితమైన ఆహార సంస్కృతి వాతావరణాన్ని సృష్టించడం మన కర్తవ్యం. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు సురక్షితమైన ఆహారాన్ని అందించడానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నందున, ఆహార వినియోగదారులుగా మనం సహకరించాలి. ఇప్పుడు మనం కరోనా యుగంలో జీవిస్తున్నాం. ప్రస్తుతం ప్రతిచోటా ప్రజలలో ఒక రకమైన గందరగోళం మరియు ఆందోళన ఉంది. ఈ సందర్భంలో, ఆహార భద్రత కోసం కొత్త ప్రపంచ వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరం ఉంది. ఆహార వినియోగదారులుగా, ఆహార భద్రత కొన్ని ముఖ్యమైన అంశాలను మనం గుర్తుంచుకోవాలి. ఈ విషయాలను మనం గుర్తుంచుకోవాలి, ముఖ్యంగా ఆహారం ప్రాసెసింగ్, అవి ప్యాక్ చేయబడిన విధానం, వాటిలోని పోషకాలు మరియు మనం ప్రతిరోజూ సురక్షితమైన ఆహారాన్ని తినవలసిన అలవాట్ల గురించి సమాచారం. కాబట్టి ఈ కరోనా కాలంలో మనం ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన ఆహారాన్ని ఎలా తినవచ్చో ఈ పోస్ట్ లో చూడవచ్చు. గమనిక చ 1 గమనిక చ 1 కిరాణా దుకాణం లేదా సూపర్ మార్కెట్‌కు వెళ్లేముందు ఏమి కొనాలి అనే జాబితాను రూపొందించండి. అనవసరమైన వస్తువులను కొనవద్దు. ఒకటి లేదా రెండు వారాలకు పచారీ కొనడం మంచిది. కాబట్టి మీరు ఈ కరోనా కాలంలో అనవసరంగా దుకాణాలకు వెళ్లడాన్ని నివారించవచ్చు. 'ఈ' పోషక ఆహారాన్ని ఎక్కువగా తినడం వల్ల మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి ... జాగ్రత్త!'ఈ' పోషక ఆహారాన్ని ఎక్కువగా తినడం వల్ల మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి ... జాగ్రత్త! గమనిక చ 2 గమనిక చ 2 మీరు ఫుడ్ ప్యాకేజింగ్ పై సూచనలను చదవాలి మరియు వాటిలో ఉన్న పోషక సమాచారాన్ని తెలుసుకోవాలి. దీని ద్వారా ఆహారం మరియు దీర్ఘకాలిక వ్యాధుల మధ్య సంబంధాలను తెలుసుకోవచ్చు. నిజమైన లేదా అసలైన ఉపకరణాలలో లేని సుగంధ ద్రవ్యాలు నకిలీ ఉత్పత్తులలో ఎక్కువగా ఉంటాయి. కలుషితమైన ఆహారాలను పరీక్షించాలి. బహుశా ఆ ఆహారానికి అవసరమైన పదార్థాలు చాలా ఎక్కువ లేదా చాలా తక్కువగా ఉంటే, ఆహారం నకిలీదని మీరు తెలుసుకోవచ్చు. ఇందుకోసం మీరు లోగో మరియు ఎఫ్ఎస్ఎస్ఏఐ మంత్రిత్వ శాఖ అందించిన స్మార్ట్ కన్స్యూమర్ యాప్ ప్రాసెసర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ప్రాసెసర్ ప్యాకేజీలోని ఆహార పదార్థాల సమాచారాన్ని చాలా ఖచ్చితంగా ప్రింట్ చేయబడి ఉంటుంది. భోజనం చేసిన వెంటనే ఇలా చేస్తే క్యాన్సర్ కు గురికాక తప్పదు ...భోజనం చేసిన వెంటనే ఇలా చేస్తే క్యాన్సర్ కు గురికాక తప్పదు

# 'బిట్స్ అండ్ పీసెస్' వ్యవహారంలో అభిమానితో మంజ్రేకర్ చాట్ లీక్


ముంబై: టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకి ఇంగ్లీష్ రాదని, అందువల్లే తాను బిట్స్ అండ్ పీసెస్ అంటూ చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నాడని భారత మాజీ క్రికెటర్, ప్రముఖ వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు. బిట్స్ అండ్ పీసెస్ వ్యవహారంపై ఓ నెటిజన్‌తో జరిపిన చాట్‌లో ఆయన ఈ మేరకు కామెంట్ చేశాడు. అయితే, తాజాగా ఈ చాట్‌కు సంబంధించిన స్క్రీన్ షాట్స్ వెలుగులోకి రావడంతో జడేజా, మంజ్రేకర్ మధ్య వార్ మళ్లీ మొదలైనట్లైంది. వివరాల్లోకి వెళితే.. సూర్య నారాయణ్ అనే ట్విటర్ యూజర్, తాను మంజ్రేకర్‌తో జరిపిన ట్విటర్ సంభాషణను లీక్ చేశాడు. అందులో మంజ్రేకర్.. జడేజాకు ఇంగ్లీష్ రాదని, అసలు తాను ఏం చెబుతున్నానో కూడా అతనికి అర్థం కాదని హేళన చేస్తాడు.

# నెట్ ఫ్లిక్స్ లో తాప్సీ 'హసీన్ దిల్ రుబా'




పెద్ద తెరపై సినిమాల్ని రిలీజ్ చేసే సన్నివేశం లేకపోవడంతో అది టెలివిజన్ రంగానికి డిజిటల్ రంగానికి పెద్ద ఎత్తున కలిసొచ్చింది. ముఖ్యంగా ఓటీటీ రంగం ఒక్కసారిగా దేశంలో ఊపందుకునేందుకు ఇది పెద్ద ఊతమిచ్చింది. అయితే పరిశ్రమల పునరుద్ధరణకు సహాయపడటానికి థియేట్రికల్ విడుదలలను చేయాలని థియేటర్ యజమానులు చిత్రనిర్మాతలను కోరినప్పటికీ అది సాధ్యపడడం లేదు.ఆ క్రమంలోనే అమెజాన్ .. నెట్ ఫ్లిక్స్ లో పలు క్రేజీ సినిమాలు రిలీజైపోతున్నాయి. ఇప్పుడు తాప్సీ పన్ను నటించిన 'హసీన్ దిల్ రుబా' యుఎస్ కి చెందిన స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ లో జూలై 2 న విడుదలవుతోంది. మిస్టరీ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి వినీల్ మాథ్యూ దర్శకత్వం వహించారు. కలర్ ఎల్లో ప్రొడక్షన్స్ పతాకంపై ఆనంద్ ఎల్. రాయ్ – హిమాన్షు శర్మ నిర్మించారు. ఇందులో విక్రాంత్ మాస్సే – హర్షవర్ధన్ రాణే తదితరులు నటించారు.పరిణీతి చోప్రా ది గర్ల్ ఆన్ ది ట్రైన్ సెకండ్ వేవ్ భారతదేశాన్ని తాకడానికి ముందే స్ట్రీమింగ్ మార్గానికి కట్టుబడి ఉంది. తాప్సీ నటించిన హసీనా దిల్ రుబా కూడా ఓటీటీ రిలీజ్ ని ఉద్ధేశించి తెరకెక్కించినదే.హసీనా దిల్ రుబా చిత్రానికి సుమారు 20 కోట్ల డీల్ కుదరగా..రూ. 15 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాని తెరకెక్కించారు. ప్రకటనల కోసం అదనంగా మరో 8–10 కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని భావించి ఓటీటీకి ఇచ్చేశారట. కార్తీక్ ఆర్యన్ ధమాకా ను కూడా నెట్ ఫ్లిక్స్ రిలీజ్ చేయనుంది. ఫర్హాన్ అక్తర్ తూఫాన్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులోకి రానుంది.

# తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లు తెరిచేది అప్పుడేనా..?



కరోనా వైరస్ కారణంగా సినీ ఇండస్ట్రీ కూడా బాగా నష్టపోయింది. సినిమా షూటింగులు నిలిచిపోయి.. థియేటర్లు మూతపడి చిత్ర పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టబడింది. అయితే ఫస్ట్ వేవ్ సమయంలో మన టాలీవుడ్ అందరి కంటే ముందుగానే తెరుకుందని చెప్పవచ్చు. ఇప్పుడు సెకండ్ వేవ్ ప్రభావం నుంచి కూడా బయటపడటానికి టాలీవుడ్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలతో ఈరోజు సోమవారం నుంచి షూటింగ్స్ చేసుకోడానికి అనుమతులు ఇవ్వడంతో.. ఇక్కడ కూడా షూటింగ్ లు ప్రారంభించే దిశగా నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. జూన్ రెండో వారం నుంచి తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పర్మిషన్ ఇస్తాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతేకాదు కరోనా కేసుల సంఖ్య తగ్గుతూ వస్తుండటంతో జూలై ఫస్ట్ వీక్ నుంచి థియేటర్లు ఓపెన్ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అయితే థియేటర్లు తెరుచుకున్నా పూర్తి స్థాయిలోనే సీటింగ్ ఆక్యుపెన్సీకి అవకాశం ఉండకపోవచ్చు. గతేడాది మాదిరిగానే ముందుగా 50 శాతం ఆక్యుపెన్సీతో థియేటర్లు తెరచుకుంటాయని అందరూ భావిస్తున్నారు. యాభై శాతంతో థియేటర్లు రీ ఓపెన్ చేసినా సినిమాలను విడుదల చేయడానికి నిర్మాతలు రెడీగా ఉన్నారని తెలుస్తోంది. పెద్ద సినిమాల సంగతి పక్కన పెడితే చిన్న మీడియం సినిమాలన్నీ స్క్రీన్ మీదకు వచ్చే ఛాన్స్ ఉంది.ఇప్పటికే థియేట్రికల్ రిలీజ్ అనౌన్స్ చేసి వాయిదా పడిన చిత్రాలన్నీ రీ షెడ్యూల్ చేసుకోవడానికి సిద్ధపడుతున్నారు. జూలై లో రిలీజ్ అయ్యే చిన్న సినిమాలకు వచ్చే రెస్పాన్స్ ని చూసి.. మీడియం చిత్రాలు క్యూ కట్టనున్నాయి. అంటే ఆగస్ట్ – సెప్టెంబర్ నెలల్లో 'లవ్ స్టోరీ' 'విరాటపర్వం' 'టక్ జగదీష్' 'రిపబ్లిక్' 'పాగల్' 'లక్ష్య' లాంటి క్రేజీ ప్రాజెక్టులు విడుదలయ్యే అవకాశం ఉంది.

# మెగాస్టార్ – రెబల్ స్టార్ మూవీస్ పై అయోమయం.. రిలీజ్ అప్పుడేనా??



దేశంలో ప్రస్తుతం కరోనా ప్రభావం తగ్గుముఖం పడుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. అందుకే సినిమా ఇండస్ట్రీలో షూటింగ్స్ మొదలుపెట్టే ఆలోచనలో మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. వీలైనంత త్వరగా షూటింగ్స్ ముగించి థియేటర్స్ ఓపెన్ కాగానే రిలీజ్ చేద్దామని సిద్ధం అవుతున్నారు. అయితే స్టార్స్ నుండి జూనియర్స్ వరకు అందరి సినిమాలు పట్టాలెక్కనున్నాయి. స్టార్ డైరెక్టర్ కొరటాల శివ రెండేళ్లుగా మెగాస్టార్ చిరంజీవితో ఆచార్య అనే సినిమా రూపొందిస్తున్నాడు. మెగాస్టార్ కెరీర్లో 152వ మూవీగా తెరకెక్కుతున్న ఆచార్యను భారీ బడ్జెట్ తో మ్యాట్నీ ఎంటర్టైన్మెంట్ – కొణిదెల ప్రొడక్షన్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలో మెగాస్టార్ సరసన కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తోంది. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉన్నటువంటి ఈ సినిమా కరోనా కారణంగా ఆగిపోయింది.అలాగే టాలీవుడ్ టు పాన్ ఇండియా స్టార్ అయినటువంటి డార్లింగ్ ప్రభాస్.. రాధేశ్యామ్ మూవీ గురించి ఇండియా వ్యాప్తంగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ ఏడాది రాధేశ్యామ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న రాధేశ్యామ్ సినిమాకు సంబంధించి మరో చిన్న షెడ్యూల్ మిగిలి ఉందట. ఆ ఒక్కటి కూడా రాధేశ్యామ్ రిలీజ్ డేట్ వచ్చేలోపు ఫినిష్ చేయాలనీ ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. రాధేశ్యామ్ కేవలం రిలీజ్ మాత్రమే మిగిలి ఉందని ఫ్యాన్స్ ఎక్సపెక్ట్ చేశారు. రాధాకృష్ణకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పూజాహెగ్డే హీరోయిన్ గా నటిస్తోంది.ప్రస్తుతం ఆచార్య – రాధేశ్యామ్ మూవీస్ గురించి సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే ప్రస్తుతం ఈ సినిమాల రిలీజ్ డేట్స్ గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇదివరకు ఆచార్య మేలో.. రాధేశ్యామ్ జులైలో రిలీజ్ షెడ్యూల్ ఖరారు చేశారు. కానీ తాజా సమాచారం ప్రకారం.. ఈ మూవీస్ మేకర్స్ ప్రస్తుతం ఈ రెండు సినిమాలను దసరా ఫెస్టివల్ సందర్భంగా ప్లాన్ చేస్తున్నట్లు టాక్ నడుస్తుంది. మరి నిజమో కాదో తెలియదు కానీ వార్తలైతే బాగానే వైరల్ అవుతున్నాయి. ఈ వార్తలపై క్లారిటీ రావాలంటే ఖచ్చితంగా ఇంకొంతకాలం ఆగాల్సిందే.

# చెర్రీ – పూరీ కాంబోలో మరో సినిమా..?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం 'ఆర్.ఆర్.ఆర్' తో పాటుగా 'ఆచార్య' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నాడు. ఈ రెండు సినిమాలు కూడా ఫైనల్ స్టేజీకి రావడంతో చరణ్ తదుపరి ప్రాజెక్ట్ ని ఇటీవలే ప్రకటించారు. దక్షిణాది అగ్ర దర్శకుడు శంకర్ తో ఓ పాన్ ఇండియా మూవీ చేయనున్నాడు చరణ్. దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. అయితే శంకర్ మరియు 'ఇండియన్ 2' నిర్మాతల మధ్య కొనసాగుతున్న వివాదం కారణంగా 'ఖీఅ15' ప్రాజెక్ట్ గందరగోళంలో పడింది.'ఇండియన్ 2' సినిమా పూర్తయ్యే వరకు శంకర్ మరో సినిమాకు దర్శకత్వం వహించకూడదని లైకా సంస్థ పట్టుబడుతోంది. శంకర్ ఈ సమస్యలను పరిష్కరించుకోడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. దీంతో ఖీఅ15 ప్రాజెక్ట్ ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఆలోచనలో పడిన రామ్ చరణ్ ఇప్పుడు ప్రత్యామ్నాయంగా మరో దర్శకుడిని లైన్ లో పెట్టే పనిలో ఉన్నారట.చరణ్ తో త్రివిక్రమ్ శ్రీనివాస్ – సుకుమార్ వంటి స్టార్ డైరెక్టర్స్ ఇదివరకే చర్చలు జరిపారు. ప్రశాంత్ నీల్ కూడా ఈ వరుసలో ఉన్నాడు. కాకపోతే వీళ్ళందరూ కొత్త ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉన్నారు. రాంచరణ్ తో సినిమా చేయడానికి చాలా టైం పట్టనుంది. దీంతో ఇప్పుడు డేరింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తో డిస్కషన్ చేస్తున్నారని ఫిలిం సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది.చెర్రీ ని 'చిరుత' సినిమాతో పూరీ హీరోగా ఇంట్రడ్యూస్ చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వీరిద్దరి కలయికలో మరో మూవీ రాలేదు. ప్రస్తుతం 'లైగర్' అనే పాన్ ఇండియా సినిమా చేస్తున్నారు పూరీ. తదుపరి ప్రాజెక్ట్ కి ఇంకా కమిట్ అవ్వలేదు. ఈ నేపథ్యంలో చరణ్ – పూరీ ల మధ్య ఓ సినిమా కోసం చర్చలు జరుగుతున్నాయని అంటున్నారు. ఇందులో నిజమెంతో తెలియాల్సి ఉంది. ఏదేమైనా 'ఆర్.ఆర్.ఆర్' తర్వాత వచ్చే క్రేజ్ ని కాపాడుకోడానికి చరణ్ ఇకపై అన్నీ పాన్ ఇండియా చిత్రాలే చేయనున్నారని తెలుస్తోంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**